

గెలిచాం : విజేత గోపిమూర్తి

టీచర్ల సమస్యలు పరిష్కరిస్తా

- సీపీఎస్ రద్దుకు కృషి
- మండలిలో గళమెత్తుతా
- ఎమ్మెల్సీ గోపిమూర్తి

కలెక్టరేట్ (కాకినాడ)/కార్పొరేషన్(కాకినాడ), డిసెంబరు 9(ఆంధ్రజ్యోతి): శాసనమండలిలో గళమెత్తి ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి అహర్నిశలు కృషి చేస్తానని ఉపాధ్యాయ ఎమ్మెల్సీ బొర్రా గోపీమూర్తి అన్నారు. కాకినాడ జేఎన్‌టీయూకేలో సోమవారం విలేకరులతో మాట్లాడారు. ఎన్నో ఏళ్లుగా పరిష్కారంకాని సీపీఎస్ రద్దుకు కృషి చేస్తామన్నారు. ఉపాధ్యాయులకు అప్పగించే పనుల కారణంగా పాఠ్యాంశాలు బోధించడంలో ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తంచేశారు. ఇక నుంచి అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో నాన్ టీచింగ్ సిబ్బందిని నియమించేలా ప్రభుత్వంపై ఒత్తిడి తెస్తానన్నారు. ఎయిడెడ్ పాఠశాలలు, కళాశాలల్లో పనిచేస్తున్న ఉపాధ్యాయులకు, లెక్చరర్లకు హెల్త్‌కార్డులు జారీచేయాలని కోరతానన్నారు. కూటమి ప్రభుత్వం ఉపాధ్యాయులకు ఇచ్చిన ప్రతి హామీ నెరవేర్చే వరకు శాసనమండలిలో గళమెత్తుతానన్నారు. ఎయిడెడ్, అన్‌ఎయిడెడ్ పాఠశాలల్లో ఉపాధ్యాయులకు మినిమం స్కేల్ ప్రకారం జీతాలిచ్చే విధంగా ప్రభుత్వంతో సంప్రదింపులు చేస్తామన్నారు. ఎన్నికల్లో ఇతర అభ్యర్థి ఎన్ని ప్రలోభాలకు గురిచేసినా ఉపాధ్యాయులు వాటిని అధిగమించి తనను గెలిపించారన్నారు. ఈమేరకు అన్ని పాఠశాలల ఉపాధ్యాయులకు ధన్యవాదాలు తెలుపుతున్నట్టు ఎమ్మెల్సీ గోపీమూర్తి పేర్కొన్నారు.

మూర్తీభవించిన.. విజయం

ఎమ్మెల్సీ విజేత గోపిమూర్తి



మనదే విక్టరీ ఆనందంలో ఉపాధ్యాయ ఎమ్మెల్సీ విజేత గోపీమూర్తి అభివాదం

కాకినాడ/కాకినాడకలెక్టరేట్/కార్పొరేషన్, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): అంతా ఊహించినట్టే జరిగింది. ఓట్ల లెక్కింపు అంతా వార్ వన్‌సైడ్ తరహా అయింది. కౌంటింగ్ మొదలైనప్పటి నుంచి ముగిసే వరకు పీడీఎఫ్ అభ్యర్థి గోపిమూర్తి స్పష్టమైన ఆధిక్యతతో దూసుకుపోయారు. దీంతో ఉమ్మడి ఉభయగోదావరి జిల్లాల ఉపాధ్యాయ ఎమ్మెల్సీగా గోపిమూర్తి 9,165 ఓట్లతో విజయకేతనం ఎగురవేశారు. కాకినాడ జేఎన్టీయూలో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ లైబ్రరీలో సోమవారం ఉదయం 8 గంటలకు లెక్కింపు ప్రారంభమైంది. కాకినాడ జిల్లా కలెక్టర్ షాన్‌మోహన్ సమక్షంలో అధికారులు బ్యాలెట్ బాక్సులు తెరిచి ఓట్ల లెక్కింపు మొదలుపెట్టారు. యూటీఎఫ్ బలపర్చిన అభ్యర్థి గోపిమూర్తి గెలుపొందడంతో ఇటు ఉపాధ్యాయ సంఘాలు, అటు బలపర్చిన ఉపాధ్యాయులు సంబరాలు చేసుకున్నారు. స్వీట్లు పంచి శుభాకాంక్షలు తెలుపుకున్నారు.దీంతో జేఎన్‌టీయూ ఉపాధ్యాయులతో కోలాహలంగా మారింది.

ఆది నుంచీ ఆధిక్యత..



గోపిమూర్తికి ధ్రువీకరణ పత్రం ఇస్తున్న కలెక్టర్

మొత్తం 14 టేబుళ్లపై 76 మంది ఎన్నికల సిబ్బంది బ్యాలెట్ పత్రాలు లెక్కించారు. ప్రతి 50 ఓట్లను కట్టలుగా విభజించి కౌంటింగ్‌కు సిద్ధంచేశారు. ప్రాధాన్య ఓట్ల ప్రకారం ఎవరికి ఎన్ని వచ్చాయో ఏజెంట్ల సమక్షంలో లెక్కించారు. ఈనెల 5న జరిగిన ఉప ఎన్నికల్లో మొత్తం ఆరు జిల్లాల పరిధిలో 15,494 ఓట్లు పోలయ్యాయి. ఓట్ల లెక్కింపులో భాగంగా 814 ఓట్లు చెల్లనివిగా నిర్ధారణ అయ్యాయి. ఇవి పోను మిగిలిన 14,680 ఓట్లు లెక్కించగా యూటీఎఫ్ బలపర్చిన పీడీఎఫ్ అభ్యర్థి బొర్రా గోపిమూర్తికి 9,165 ఓట్లు లభించాయి. ఓట్ల లెక్కింపు దగ్గర నుంచి చివరి వరకు పీడీఎఫ్ అభ్యర్థి గోపిమూర్తి ఆధిక్యత కనబర్చారు. మరో అభ్యర్థి గంధం నారాయణరావుకు 5,259 ఓట్లు లభించడంతో రెండో స్థానంలో నిలిచారు. నారాయణరావు ఒక దశలో కొంత వరకు పోటీ ఇచ్చారు. దీంతో కాసేపు విజయంపై ఉత్కంఠ కొనసాగింది. కానీ కాసేపటికే గోపిమూర్తికి ఆధిక్యత పెరిగి విజయం ఏకపక్షమైంది. మిగిలిన అభ్యర్థుల్లో దీపక్ పులుగు 102, నామన వెంకటలక్ష్మి 81, డాక్టరు కవల నాగేశ్వరరావు 73 ఓట్లతో ప్రభావం చూపలేకపోయారు. చెల్లిన ఓట్ల ఆధారంగా విజయం సాధించడానికి 7,341 ఓట్లు రావాల్సి ఉండగా పీడీఎఫ్ అభ్యర్థి గోపిమూర్తి 9,165 ఓట్లు కైవసం చేసుకున్నారు.ఎన్నికల కమిషన్ ఆమోదంతో ఎన్నికల రిటర్నింగ్ అధికారి, కాకినాడ కలెక్టర్ షాన్‌మోహన్ ఆయన గెలుపొందినట్టు ప్రకటించి ధ్రువీకరణపత్రాన్ని అందజేశారు.



కౌంటింగ్ సాగిందిలా : 14 టేబుళ్లపై ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఓట్లు లెక్కిస్తున్న సిబ్బంది

- 9,165 ఓట్లతో జయకేతనం
- తొలి నుంచీ స్పష్టమైన ఆధిక్యత
- ఏకపక్షంగా సాగిన ఫలితం
- కౌంటింగ్ కేంద్రం వద్ద సంబరం
- మొత్తం పోలైన ఓట్లు 15,494
- చెల్లనివి 814.. లెక్కింపు 14,680
- రెండో స్థానంలో నారాయణరావు

ఈ టీచర్లకు ఓటేయడం రాదా..!

కౌంటింగ్ ప్రక్రియలో భాగంగా అధికారులు కొన్ని ఓట్లు చూసి అవాక్కయ్యారు. నిర్దేశిత నమూనాలో కాకుండా చాలామంది ఉపాధ్యాయులు తమ ఓటు హక్కు తప్పుగా వినియోగించుకోవడం చూసి విస్తుపోయారు. మొత్తం 814 ఓట్లు చెల్లకపోవడంతో వాటన్నింటినీ పక్కన పెట్టేశారు. వాస్తవానికి ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో బరిలో ఉన్న అభ్యర్థులకు ఓటర్లు ప్రాధాన్యత క్రమంలో టిక్ పెట్టి ఓట్లు వేయాలి. కానీ చాలామంది అభ్యర్థి ఎదురుగా కాకుండా ఎగుడు దిగుడులో తమ ఓటు హక్కు వినియోగించుకున్నారు. ఆయా సంఘాలు ఓటు హక్కు వినియోగంపై ఓటర్లకు శిక్షణ ఇచ్చారు. అయినా చెల్లని ఓట్లు భారీగా పడడం విశేషం.



ఏజెంట్లకు చెల్లని ఓట్లను చూపుతున్న సిబ్బంది

ఎంత పాపం!



జగ్గంపేటలోని పోలవరం కాల్వగట్టు వద్ద పశువుల సంతలో గోవుల తరలింపునకు సిద్ధంగా ఉన్న వాహనాలు

- పశువుల తరలింపునకు కేంద్రంగా జగ్గంపేట
- ఇతర రాష్ట్రాల్లో కబేళాలకు ఆవుల ఎగుమతులు
- యథేచ్ఛగా తరలిపోతున్నా పట్టని అధికారులు

జగ్గంపేట, డిసెంబరు 9(ఆంధ్రజ్యోతి): జిల్లాలో యథేచ్ఛగా కబేళాకు గోవుల తరలింపు జరుగుతోంది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఆరునెలలు గడుస్తున్నా ఈ తంతు నడుస్తుండడం ఆందోళన కలిగిస్తోంది. టీటీడీ సభ్యుడిగా నియమితులైన జగ్గంపేట ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ నియోజకవర్గ కేంద్రంగా ఈ వ్యవహారం నడుస్తోంది. పైస్థాయి ప్రజాప్రతినిధుల దృష్టికి ఈ విషయం వెళ్లకపోవడంతో కింది స్థాయిలో కొందరు దీన్ని ఆదాయ మార్గంగా చేసుకుని గుట్టు చప్పుడు కాకుండా నడిపిస్తున్నారన్న ఆరోపణలున్నాయి.

జగ్గంపేటలో పశువుల సంత

జిల్లాలోని జగ్గంపేట కేంద్రంగా పశువుల సంత నడుస్తోంది. ఇక్కడ గేదులు, ఆవులు, దున్నపోతుల క్రయవిక్రయాలు జరుగుతుంటాయి. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాతోపాటు విజయనగరం, శ్రీకాకుళం, విశాఖ జిల్లాల నుంచి ఈ సంతకు పశువులను అమ్మకాలకు తీసుకొస్తుంటారు. ఇక్కడ గతంలో సోమవారం ఒక రోజే సంత నిర్వహించేవారు. ఈ మధ్య ఆది, సోమ, మంగళవారాల్లోను నిర్వహిస్తున్నారు. సంతలో పశువుల అమ్మకాలు జరపాలంటే ముందుగా పశువైద్యాధికారులు పరిశీలించాలి. ఈ సంత నిర్వహణకు పంచాయతీ అనుమతి, వేలంపాట కూడా జరుపుతారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత వేలంపాటను రద్దు చేస్తున్నట్టు తీర్మానం చేశారు. సదరు పాడుకున్న వ్యక్తికి సంత నిర్వహణకు అనుమతి లేదని పేర్కొన్నారు. అయినా ఒక ప్రభుత్వ స్థలంలో ఈ సంతను నిర్వహిస్తూ వేలాది ఆవులు, దూడలను కబేళాలకు తరలిస్తునట్టు స్థానిక హిందూ ధర్మ పరిరక్షణ సమితి సభ్యులు ఆరోపిస్తున్నారు.



జగ్గంపేటలో రాత్రిపూట వాహనాల్లో పశువుల దిగుమతులు

చూసీచూడనట్టుగా అధికారులు

జగ్గంపేటలో పశువుల సంత నిర్వహణపై కాకినాడకు చెందిన విశ్వ హిందూ పరిషత్ వారు జగ్గంపేటలో సంత నిర్వహణకు కాకినాడ జిల్లా గోసంరక్షణ హైకోర్టులో కేసు వేశారు. దీనిపై పూర్తిస్థాయిలో సమాచారం తెలియజేయమని హైకోర్టు ఆదేశాలు ఇచ్చినా అధికారులు తమకు సంబంధం లేదంటూ కోర్టుకు తప్పుడు సంకేతాలు పంపారని వారు ఆరోపిస్తున్నారు. పశువుల తరలింపుపై అధికారులకు తెలిసినా తెలియనట్టుగా ఉంటున్నారన్న విమర్శలున్నాయి. జగ్గంపేట ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూకు టీటీడీ పాలకమండలి సభ్యులుగా నియమితులయ్యారు. ఆయన సనాతన ధర్మానికి, హిందూ ధర్మానికి కట్టుబడి అనేక కార్యక్రమాలు సైతం నిర్వహించారు. ఆయన నియోజకవర్గంలో జరుగుతున్న ఈ వికృత క్రీడను నియంత్రించే ప్రయత్నం చేయాలని ఆధ్యాత్మికవేత్తలు కోరుతున్నారు.

రాత్రివేళల్లో తరలింపు

జగ్గంపేట సంతలో పశుఅమ్మకాల మాటున గోసంపదను ఇతర రాష్ట్రాల కబేళాలకు తరలిస్తున్నారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. స్థానిక పశువులతోపాటు ఇతర జిల్లాలనుంచి సైతం పశువులు ఈ సంతకు భారీగా తీసుకువస్తున్నారు. ఈ ముసుగులో హైదరాబాద్, చెన్నై, కేరళ ప్రాంతాల్లోని కబేళాలకు గోవుల ఎగుమతులు జోరుగా సాగుతున్నాయి. గోవధకు నిశిరాత్రి వేళలో ఫ్లడ్ లైట్ల వెలుగులో మూగజీవాలను కబేళాల తరలింపునకు ఎగుమతులు చేస్తున్నారు. చిన్న వాహనాల్లో ఇరికించి మరీ దూరప్రాంతాల్లోని కబేళాకు తరలిస్తున్నారు. కాకినాడ జిల్లాలో పిఠాపురం, తుని, కోనసీమ జిల్లాలోని ద్రాక్షారామలో పశువుల సంతను నిలిపివేతతో కబేళాకు పశువులు తరలివెళ్లకుండా చర్యలు చేపట్టారు. కానీ జగ్గంపేటలో సంత దళారీ వ్యవస్థ చేతిలో నడుస్తోంది.

కలెక్టర్, ఎస్పీ స్పందించాలి

ఉమ్మడి జిల్లాల్లో పశువుల సంతల నిర్వహణపై గతంలోనే హైకోర్టులో కేసులు వేయగా అప్పుడు కొన్ని నిబంధనల ప్రకారం వీటిని నిర్వహించాలని ఆదేశాలు వచ్చాయి. దీంతో పిఠాపురం, గోకవరం ప్రాంతాల్లో వాటిని నిలిపివేయగా జగ్గంపేటలో మాత్రం నిబంధనలను పాటించడంలేదు. దీనిపై మళ్లీ కోర్టులో కేసు వేశాం. దీనిపై త్వరలోనే హైకోర్టు ఆదేశానుసారం అధికారులకు ఆర్డర్ కాపీలు వస్తాయి. దీనిపై కలెక్టర్, ఎస్పీ స్పందించాలి.

-గోపాల్ ఆర్.సూరాబత్తుల,
రాష్ట్ర జంతు సంక్షేమ బోర్డు వ్యవస్థాపకుడు, కాకినాడ

పోలీస్ గ్రీవెన్స్‌కు 43 అర్జీలు

కాకినాడ క్రైం, డిసెంబరు 9(ఆంధ్రజ్యోతి): వ్యక్తిగత సమస్యలతో బాధపడుతూ పోలీస్‌స్టేషన్‌లకు వచ్చే బాధితులకు స్థానికంగా వారి సమస్యలను అధికారులు పరిష్కరించాలని ఎస్పీ విక్రాంత్‌పాటిల్ ఆదేశించారు. జిల్లావ్యాప్తంగా 43మంది అర్జీదారులు సోమవారం పోలీస్ గ్రీవెన్స్‌సెల్‌ను ఆశ్రయించారు.కార్యక్రమంలో అడ్మిన్ ఎస్పీ ఎంజేవీ భాస్కరరావు, ఎస్బీ డీఎస్పీ సీహెచ్ శ్రీరామకోటేశ్వరరావు పాల్గొన్నారు.




గ్రీవెన్స్‌లో అర్జీలు స్వీకరిస్తున్న ఎస్పీ విక్రాంత్

వినూత్నంగా 'బచ్చల మల్లి' సినిమా ప్రచారం

- క్రికెట్ ఆడిన హీరో అల్లరి నరేష్
- తుని యువతతో క్రికెట్ ఆడిన సినిమా టీం
- విజేతలతో చిత్రంలోని ఒక పాట ఆవిష్కరణ

6



తునిలో క్రికెట్ ఆడుతున్న హీరో అల్లరి నరేష్

బురదకోటలో పెద్దపులి! 7

తీరంలో ఉవ్వెత్తున ఎగసిపడుతున్న అలలు 6

తునిలో రేషన్‌బియ్యం స్వాధీనం 7

జీజీహెచ్‌లో డీఎంఈ తనిఖీలు

జీజీహెచ్(కాకినాడ), డిసెంబరు9(ఆంధ్రజ్యోతి): డైరెక్టర్ ఆఫ్ మెడికల్ ఎడ్యుకేషన్(డీఎంఈ) డాక్టర్ డీఎస్‌వీఎల్ నరసింహం కాకినాడ జీజీహెచ్‌లో సోమవారం తనిఖీ చేశారు. ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ లావణ్యకుమారితో కలిసి ఆయన తొలుత అత్యవసర విభాగాన్ని సందర్శించారు. అక్కడ రోగికి అందుతున్న వైద్యసేవలను చూసి క్యాజువాలిటీ మెడికల్ ఆఫీసర్‌పట్ల అసంతృప్తి వ్యక్తం చేశారు. అనంతరం మెడిసన్ ఓపీని పరిశీలించారు. రెండు యూనిట్ల వైద్యనిపుణులు ఒకేరోజు ఓపీ చూస్తే రద్దీని నియంత్రించవచ్చని సూచించారు. అనంతరం రేడియాలజీ విభాగాన్ని సందర్శించి ఎక్స్‌రే యంత్రాలు, స్కానింగ్ పరికరాల పనితీరును పరిశీలించారు. ట్విన్ ఆపరేషన్ థియేటర్‌లో మౌలిక సదుపాయాలు, సౌకర్యాలను పరిశీలించారు. ఆయన వెంట డిప్యూటీ సూపరిండెంట్ డాక్టర్ శ్రీనివాసన్, సీఎస్ఆర్ఎంవో డాక్టర్ కోనాల అనిత, సైకియాట్రీ వైద్యనిపుణులు డాక్టర్ వరప్రసాద్ ఉన్నారు.



జీజీహెచ్‌లో పలు విభాగాలను పరిశీలిస్తున్న డీఎంఈ

- ఆంధ్రజ్యోతి/ఆలమూరు





పంటల సాగులో..
ఇక 'నానో' శకం!

భూమికి అపకారిగా మారిన ఎరువుల వాడకం తగ్గించి ప్రత్యామ్నాయ పద్ధతుల్లో భాగంగా 'నానో' లిక్విడ్‌ను తీసుకొచ్చారు. ఎరువులతో సమానంగా పనిచేసే నానో వల్ల అధిక ప్రయోజనాలు ఉన్నాయని వ్యవసాయశాస్త్రవేత్తలు చెబుతున్నారు. వ్యవసాయ రంగంలో సాగు చేసే అన్ని రకాల పంటలకు నానో ఎంతగానో ఉపయోకరంగా ఉంటుందంటున్నారు. భారతదేశంలో ఎరువులు తయారు చేసే అన్ని కంపెనీలు ప్రస్తుతం ఈ నానో లిక్విడ్ తయారీపై దృష్టి పెట్టాయి. వీటి వాడకం వల్ల తక్కువ ఖర్చుతో అధిక దిగుబడులు సాధించే వీలుంటుందని.. ముఖ్యంగా భూమికి ఎటువంటి ప్రమాదం ఉండదని వ్యవసాయాధికారులు ఇటీవల కాలంలో రైతులకు అవగాహన కల్పిస్తున్నారు.

- ఎరువులకు బదులుగా నానో పెస్టిసైడ్ లిక్విడ్స్
- ఎరువులు వద్దు నానో ముద్దు అంటున్న శాస్త్రవేత్తలు
- భవిష్యత్ అంతా 'నానో'దే
- ఇంకా ఆసక్తి చూపని రైతులు

నానో లిక్విడ్.. ప్రయోజనాలెన్నో..

ఎరువులకు ప్రత్యామ్నాయంగా నానో లిక్విడ్‌ను ఉపయోగించడం వల్ల అధిక ప్రయోజనాలు ఉన్నాయని వ్యవసాయ శాస్త్రవేత్తలు, అధికారులు చెబుతున్నారు. అలాగే ఉత్పత్తి పెంపుదలతోపాటు ఆదాయం పెరుగుతుంది. నేల, గాలి, నీరు కలుష్యాన్ని తగ్గిస్తుంది. తెగుళ్ళ, వ్యాధులను తగ్గిస్తుంది. ఉత్పత్తి నాణ్యతను పెంచుతుంది. పూర్తిగా హాని చేయనిది. పంటలకు జీవులకు సురక్షితమైనది. నిల్వ చేయడం, రవాణా సులభతరం కావడంతో పాటు లాభదాయకంగా ఉంటుంది.

నానో వాడకం ఇలా..

కొంతకాలంగా మార్కెట్‌లో లభ్యమవుతున్న ఈ నానో ఎరువుల గురించి రైతు వర్గాల్లో చర్చ జరుగుతోంది. ఎరువులతో పోల్చితే నానో వాడకం సులభతరంగా భావిస్తున్నారు. పైరు ఎదుగుదలకు వాడే ఎరువులకు బదులుగా వాడే ఈ నానో లిక్విడ్ ద్రవ రూపంలో లభ్యమవుతుంది. భూమిలో చల్లకుండా కేవలం పైరుపై పురుగుమందుల మాదిరిగానే పిచికారి చేస్తే ఎరువులు వేసిన దాని మంచి ప్రయోజనం ఉంటుందని అధికారులు చెబుతున్నారు. పిచికారీ చేయడం వల్ల భూమికి ఎటువంటి హాని చేయదు.

ఎరువులతో పోల్చితే అధిక లాభం..

ఎరువుల వాడకంతో పోల్చితే నానో వాడకం వల్ల అధిక లాభదాయంగా ఉంటుంది. ఉదాహరణకు ఎకరం భూమికి పంటను బట్టి డీఏపీ 50 నుంచి 75 కిలోలు వాడుతుంటారు. దీనివల్ల డీఏపీ 50కిలోల బస్తా రూ.1350కు మార్కెట్లో లభ్యమవుతోంది. దీనిని బట్టి చూస్తే దాదాపు ఎకరానికి రూ.రెండు వేల వరకు ఖర్చు. నానో 500 ఎంఎల్ బాటిల్ ఎకరానికి సరిపోతుంది. ఈ బాటిల్ ఖరీదు రూ.600. అంటే ఎంత తక్కువ ఖర్చో చూడండని రైతులకు అధికారులకు అవగాహన కల్పిస్తున్నారు.

రైతుల్లో ఆసక్తి అంతగా లేదు

కొత్తగా మార్కెట్లోకి వచ్చిన ఈ కొత్త నానో లిక్విడ్స్ పట్ల రైతులు ఆసక్తి చూపించడం లేదు. ఎరువుల వాడకానికి అలవాటు పడిన రైతులు లిక్విడ్‌ను వాడకం వల్ల పంట దిగుబడులు ఏవిధంగా ఉంటాయోనని భయపడుతున్నారు. దీంతో వీటిని వాడడానికి రైతులు వెనుకడుగు వేస్తున్నారు. అయితే సహకార సంఘాలు, ఎరువుల డీలర్లు రెండు బస్తాలు కావాలంటే ఒక బాటిల్ కొనాల్సిందేనని ఆంక్షలు పెడుతున్నారు. దీంతో కొంతమంది రైతులు కొనుగోలు చేసినప్పటికీ వాడకకుండా వదిలేస్తున్నారు.



భవిష్యత్ అంతా నానోదే..

భవిష్యత్ కాలంలో ఎరువులకు బదులుగా నానో లిక్విడ్ వాడకమే ఉంటుంది. ఎందుకంటే ఎరువులకంటే నానో సురక్షితం. అందుకే రైతులకు పూర్తి స్థాయిలో అవగాహన కల్పిస్తున్నాం. నానో వాడకం వల్ల భూమికి ఎటువంటి హాని ఉండదు. పైగా పెట్టుబడి కూడా ఆదా అవుతుంది.

-కె.నాగేశ్వరరావు, ఏడీఏ, ఆలమూరు మండలం







గుడ్‌లక్ బేంబో.. ముచ్చటగా!



శుభాలనిచ్చే మొక్కలు ఎన్నో రూపాల్లో..

(ఆంధ్రజ్యోతి - కడియం)

నిత్యం ఆకుపచ్చగా అలరారే ఇండోర్ ప్లాంట్ రకం మొక్క గుడ్‌లక్ బేంబో. కేవలం నీళ్లలోనే పెరిగే ఈ వెదురు జాతి మొక్క చైనాలో ఉత్పత్తి అవుతుంటాయి. వీటిని మన కడియం నర్సరీలకు దిగుమతి చేసుకుంటారు. రకరకాల ఆకారాల్లో ఈ మొక్క కొలువుదీరి అందరినీ కనువిందు చేస్తాయి. ఆకారం, పరిమాణాన్నిబట్టి గుడ్‌లక్ బేంబో ధర ఉంటుంది. అంటే రూ.500 నుంచి రూ.50 వేల దాకా. ఇది సూర్యరశ్మి వెలుతురు లేకుండానే చక్కగా నిగారింపుతో పెరిగే మొక్క. గుడ్‌లక్ బేంబో ఇంటిలో ఉంటే అంతా శుభం అనేది చైనీయుల విశ్వాసం. ఈ మొక్కను ఇంటిలో ఉంచుకుంటే శుభాలు కలుగుతాయని అందుకే 'గుడ్‌లక్' అని, వెదురు కాబట్టి 'బేంబో' అని, వెరసి గుడ్‌లక్ బేంబోగా, లక్కీ బేంబోగా పిలుస్తారు. ప్రతీ శుభకార్యానికి బహుమతులు బదులు మొక్కలు ఇవ్వడం ట్రెండ్‌గా మారింది. ఇటీవల ఈ మొక్కను పుట్టినరోజు, వివాహ వేడుకలు, నూతన సంవత్సరం, అధికారులు ఉన్నతాధికారులకు మొక్కను ఇచ్చి శుభాకాంక్షలు తెలుపుతున్నారు. గుడ్‌లక్ బేంబో మొక్కను ఇండోర్ మొక్కగా షోకేజ్‌లు, టీపాయ్‌లు, అల్మారా, టీవీ స్టాండ్‌లు, బెడ్‌రూమ్‌లోను పెట్టుకోవచ్చు. సముద్రపు నీరు తగలకుండా స్వచ్ఛమైన నీటిని రెండు రోజులకొకసారి తగిన మోతాదులో పోసుకుంటే సరిపోతుంది. ప్రస్తుతం కడియం నర్సరీలో వివిధ ఆకృతుల్లో, వివిధ పరిమాణాల్లో గుడ్‌లక్ బేంబోలు రమణీయంగా దర్శనమిస్తున్నాయి.



ఆరోజు రానివారికి.. కబురు పంపండి!

- టీచర్ పేరెంట్స్ సమావేశానికి హాజరుకాని తల్లితండ్రులకు మళ్లీ పిలుపు
- విద్యార్థులతో చెప్పి రప్పించాలని ఉపాధ్యాయులకు విద్యాశాఖ ఆదేశాలు
- ప్రోగ్రెస్ కార్డు ఇచ్చి.. విద్యార్థుల ఆరోగ్య అంశాలు నమోదు చేయాలని సూచన

మండపేట, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): ఈ నెల 7వ తేదీన ప్రభుత్వ పాఠశాలల్లో నిర్వహించిన మెగా పేరెంట్, టీచర్స్ మీట్ (పీటీఎం) విజయవంతంగా జరిగిన విషయం తెలిసిందే. ఆ సందర్భంగా పిల్లల మార్కులతోపాటు వారి ఆరోగ్య వివరాలనూ తల్లిదండ్రులకు తెలియజేశారు. కానీ వివిధ కారణాలతో ఆరోజు సమావేశానికి కొందరు తల్లిదండ్రులు హాజరుకాలేదు. ఇలా హాజరుకాని తల్లిదండ్రులకు విద్యార్థుల ద్వారా కబురు పంపించి పాఠశాలకు పిలిపించి వారికి ప్రోగ్రెస్ కార్డు, విద్యార్థుల ఆరోగ్య సమస్యలు తెలియపరచాలని విద్యాశాఖ అధికారులను ఆదేశించింది. అదేవిధంగా ప్రతి విద్యార్థి ఆరోగ్య వివరాలు తప్పనిసరిగా హెల్త్‌కార్డులో నమోదు చేసేలా చర్యలు తీసుకోవాలని పాఠశాల ప్రధానోపాధ్యాయులకు తాజాగా సూచించారు. పీటీఎం సమావేశం రోజున చాలా పాఠశాలల్లో 9, 10 తరగతి విద్యార్థులకు సంబంధించిన ఆరోగ్య వివరాలను మాత్రమే వైద్య ఆరోగ్యశాఖ వెల్లడించింది. మిగిలిన తరగతుల పిల్లల ఆరోగ్య విషయాలు నమోదు ఇంకా పూర్తికాలేదు. ఈనేపథ్యంలో కొందరు తల్లిదండ్రులు తమ పిల్లలకు నిర్వహించిన వైద్య పరీక్షల్లో ఏమైనా సమస్యలు ఉన్నాయా అని ఆరా తీశారు. దాంతో 9, 10 తరగతుల విద్యార్థులు మినహా మిగిలిన విద్యార్థుల వివరాలు ఇంకా హెల్త్‌కార్డులో పొందుపరచలేదని అధికారుల దృష్టికి వచ్చింది. వెంటనే ఆ విద్యార్థులు, వివరాలను హెల్త్‌కార్డులో నమోదు చేయించి వారి తల్లితండ్రులకు పిల్లల ఆరోగ్య సమాచారం తెలియపరచాలని హెచ్ఎంలను ప్రభుత్వం ఆదేశించింది.

ఆరోగ్య సమస్యలకు ఆదిలోనే చికిత్స

గత వైసీపీ ప్రభుత్వ హయాంలో పాఠశాలల్లో పిల్లలకు వైద్యపరీక్షలు చేసినా అవి చాలా పరిమితంగానే నిర్వహించారు. బాలికల్లో రక్తహీనత తెలుసుకోవడానికి ఎనీమియా పరీక్ష, బాలురకు గ్రహణంమొర్రి, చేతులు వంకరలు పోవడం వంటి వాటికి మాత్రమే పరీక్షలు నిర్వహించి, అందుకు సంబంధించిన వైద్య సేవలందించేవారు. ఇప్పుడు అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం బాలబాలికలకు 22 రకాల వ్యాధులకు సంబంధించిన వైద్యపరీక్షలు చేయించేలా చర్యలు తీసుకోవడంతోపాటు పేరెంట్స్‌కు పిల్లల ఆరోగ్య వివరాలు తెలియజేసేలా చర్యలు చేపట్టారు. దీనివల్ల వెంటనే ఆయా వ్యాధులకు సంబంధించిన వైద్యసేవలు పొందేందుకు వీలుకలుగుతుంది. ఈరకమైన స్క్రీనింగ్ పరీక్ష వల్ల విద్యార్థులకు మేలు జరుగుతుందని ఉపాధ్యాయులు చెబుతున్నారు. ఇక గత శనివారం నిర్వహించిన మెగా పేరెంట్ టీచర్స్ సమావేశానికి అన్ని జిల్లాల్లో సగటున 70 శాతం మేర హాజరు ఉందని అధికారులు అంచనా వేశారు. మిగిలిన 30 శాతం మంది పేరెంట్స్‌ను కూడా రానున్న వారం పది రోజుల్లో పాఠశాలలకు పిలిపించి విద్యార్థి సమక్షంలో విద్యార్థికి ఇప్పటివరకు వచ్చిన మార్కులు, బడికి హాజరుతోపాటు పిల్లల క్రమశిక్షణ, ఇతర వ్యాపకాల గురించి తెలియపరచాలని ప్రభుత్వం ఆదేశించింది. దీన్ని అన్ని పాఠశాలల్లో ఆచరించి మీటింగ్‌కు హాజరుకాని ప్రతి పేరెంట్‌కు హోలిస్టిక్‌కార్డుతోపాటు హెల్త్‌కార్డును చూపించి వారి వద్ద నుంచి ధ్రువీకరణ సంతకం తీసుకోవాలని ఆదేశాలు అందాయి. ఇదిలా ఉండగా డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాలో 1567 ప్రభుత్వ పాఠశాలల్లో సుమారు లక్ష మంది వరకు విద్యార్థులు చదువుకుంటున్నారు. వీరందరికీ కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే ప్రతి గురువారం, శనివారం రెండు రోజులపాటు పాఠశాల సమీపంలో ఉన్న పీహెచ్‌సీ, ఇతర ఆసుపత్రి వైద్యులు వచ్చి 22 రకాలు వ్యాధులకు సంబంధించిన స్క్రీనింగ్ చేస్తున్నారు.

ఈ వివరాలను రాష్ట్రీయ బాల ఆరోగ్య సురక్ష జిల్లా అధికారులకు తొలుత వైద్యులు చెప్పి ఆ వివరాలను వైద్యరికార్డులో నమోదు చేస్తారు. పిల్లలకు దీర్ఘకాలిక వ్యాధులు ఏమైనా బయటపడితే వెంటనే జిల్లా ఆసుపత్రి లేదా బోధనాసుపత్రికి తల్లితండ్రులు తీసుకువెళ్లి వైద్యం అందించేలా చర్యలు తీసుకోవాలి. ఎవరెవరికి ఏ ఆసుపత్రులకు పంపించిం దనే వివరాలు పాఠశాల రికార్డుల్లో పక్కాగా నమోదు చేయాలి. ఏదైనా సమస్య వచ్చినపుడు ఈ రికార్డును ప్రమాణికంగా తీసుకుంటారు. దాన్ని దృష్టిలో ఉంచుకుని పిల్లల హెల్త్ కార్డు వివరాలను ఎప్పటికపుడు అప్‌డేట్ చేసి ఉంచాల్సి ఉందని ఉపాధ్యాయవర్గాలు తెలిపాయి.



మండపేట సంఘం కాలనీ ఎంపీపీ పాఠశాలలో పేరెంట్, టీచర్ మీట్‌లో సందడి (ఫైల్‌ఫొటో)

పీటీఎం స్పందన బాగుంది..

పేరెంట్, టీచర్స్ సమావేశాలకు వచ్చిన స్పందన చాలా బాగుందని పాఠశాలల్లో ఉపాధ్యాయులు చెబుతున్నారు. తల్లిదండ్రుల హాజరుశాతం కూడా బాగుందని, వారి పిల్లల ప్రతిభా వివరాలతో పాటు ఆరోగ్య సమస్యల వివరాలు అడిగి తెలుసుకోవడానికి ఎంతో ఆసక్తి చూపారని ఉపాధ్యాయులు తెలియజేశారు. ఇలాంటి సమావేశాల వల్ల ఉపాధ్యాయులు, పిల్లల తల్లిదండ్రుల మధ్య సంబంధాలు పెరిగి, నిత్య పర్యవేక్షణ ద్వారా విద్యార్థుల భవితకు దోహదం చేస్తాయని పలువురు పలువురు ప్రధానోపాధ్యాయులు తెలిపారు.

గోవును జాతీయ ప్రాణిగా ప్రకటించాలి

- గో వధను సంపూర్ణంగా నిషేధించాలి: భారతీయ ధర్మ పరిషత్
- జిల్లాలవారీగా గోవుల సంరక్షణ కేంద్రాలు ఏర్పాటు చేయాలి
- దేశవ్యాప్తంగా సనాతన హైందవ దేవాలయాలకు స్వయంప్రతిపత్తి కల్పించాలి



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న భారతీయ ధర్మ పరిషత్ సభ్యులు

జగ్గంపేట, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): సనాతన ధర్మ పరిరక్షణ కోసం స్వామీజీలు స్థానిక సోమాలమ్మ తల్లి ఆలయం వద్ద నుంచి లయన్స్ క్లబ్ వరకు పాద యాత్ర నిర్వహించారు. అనంతరం భారతీయ ధర్మ పరిషత్ కాకినాడ జిల్లా అధ్యక్షుడు పాలచర్ల నాగేంద్ర ఆధ్వర్యంలో జాతీయ కార్యవర్గ సమావేశం జరిగింది. జాతీయ అధ్యక్షుడు కృష్ణచరనంద భారతీస్వామి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జిల్లాల వారీగా గోవుల సంరక్షణ కేంద్రాలు ఏర్పాటు చేయాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు విజ్ఞప్తి చేశారు. గోమాతను జాతీయ ప్రాణిగా ప్రకటిస్తూ గో వధను సంపూర్ణంగా నిషేధించాలని కోరారు. దేశవ్యాప్తంగా సనాతన హైందవ దేవాలయాలకు స్వయంప్రతిపత్తి కల్పించాలన్నారు. తిరుమలలో తక్షణం దేశవాళీ గోశాలలు, డెయిరీలు ఏర్పాటుచేసి స్వచ్ఛమైన నేతితో లడ్డూ ప్రసాదం శ్రీవారికి నైవేద్యంగా సమర్పించాలన్నారు. రాష్ట్రంలోని అన్ని దేవాలయాలకూ తిరుమల ప్రసాదం అందించే ఏర్పాటు చేయాలని త్వరలో టీటీడీ చైర్మన్‌ను కలిసి వినతిపత్రం అందిస్తామన్నారు. సమావేశంలో జనసేన జగ్గంపేట ఇన్‌చార్జి తుమ్మలపల్లి రమేష్, బీజేపీ నాయకుడు తోట సర్వారాయుడు, భారతీయ ధర్మ పరిషత్ జాతీయ కార్యనిర్వాహక అధ్యక్షుడు పొడుగు వెంకట సత్యనారాయణ ప్రసాదాచార్యులు, కృష్ణా జిల్లా అధ్యక్షుడు అభినంద స్వామి, స్కంద దేవానందగిరి స్వాములు, మాతా విద్యనందగిరి పాల్గొన్నారు.

సత్యదేవుని సన్నిధిలో హీరో అల్లరి నరేష్ పూజలు

అన్నవరం, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): రత్నగిరివాసుడైన సత్యదేవుడి సన్నిధికి సినీహీరో అల్లరి నరేష్ సోమవారం విచ్చేశారు. ఆయనకు ప్రొటోకాల్ అధికారులు కొండలరావు, గంటా విష్ణు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. స్వామి దర్శనానంతరం పండితులు వేదాశీర్వచనాలు అందజేశారు. నరేష్‌తో సెల్ఫీలు దిగేందుకు భక్తులు ఆసక్తి కనబర్చారు. పెద్దింటి తలుపులయ్య తదితరులు పాల్గొన్నారు.



సత్యదేవుడి దర్శనానంతరం సినీహీరో అల్లరి నరేష్

తలుపులమ్మ సేవలో 'బచ్చలమల్లి' సినిమా టీం

తుని రూరల్, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా తునికి చెందిన డైరెక్టర్ సుబ్బు తెరకెక్కించిన బచ్చల మల్లి సినిమా టీం సోమవారం తలుపులమ్మ అమ్మవారిని దర్శించుకుంది, ఈ నెల 20న విడుదల కానున్న ఈ చిత్రం విజయవంతం కావాలని అమ్మవారిని మొక్కుకున్నట్టు సినీ నిర్మాత రాజేష్ దండా తెలిపారు. నటుడు అల్లరి నరేష్‌ను చూసేందుకు వచ్చిన వారితో ఆ ప్రాంతం కోలాహలంగా మారింది.



సినీ బృందాన్ని ఆశీర్వదిస్తున్న పండితులు

వినూత్నంగా 'బచ్చలమల్లి' సినిమా ప్రచారం

- తుని యువతతో క్రికెట్ ఆడిన సినిమా టీం
- విజేతలతో చిత్రంలోని ఒక పాట ఆవిష్కరణ
- ట్రాక్టర్ల పోటీలు నిర్వహించి బహుమతులు
- క్రికెట్ ఆడి మెప్పించిన హీరో అల్లరి నరేష్

తుని రూరల్, డిసెంబరు 9(ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా తునిలో బచ్చలమల్లి సినీ బృందం వినూత్న ప్రచారానికి తెరతీసింది. ఉదయం, మధ్యాహ్నం ట్రాక్టర్, క్రికెట్ పోటీలు నిర్వహించి సాయంత్రం విజేతలకు బహుమతులు అందజేసింది. స్థానిక యువతతో సినీబృందం క్రికెట్ ఆడి విజేతలతో సినిమాలోని ఒక పాటను ఆవిష్కరింపజేశారు. ఈ చిత్ర హీరో అల్లరి నరేష్ బ్యాటింగ్ చేసి యువతతో కేరింతలు కొట్టించారు.

బచ్చలమల్లి చిత్ర బృందం సోమవారం తుని పట్టణంలో సందడి చేసింది. ఈ చిత్ర ప్రచారంలో భాగంగా తుని పట్టణానికి చెందిన టీంతో కలిసి క్రికెట్ ఆటాడింది. బచ్చలమల్లి మూవీ టీం ఏర్పాటు చేసిన ట్రాక్టర్ల పోటీ అభిమానులను ఆకట్టుకుంది. ఈ పోటీలు ముగిసిన తర్వాత సాయంత్రం తుని రాజా కళాశాల ప్రాంగణంలో సినిమా ఫంక్షన్ నిర్వహించారు. ఇందులో బచ్చలమల్లి సినిమా నుంచి రచయిత పూర్ణాచారా రాసిన పాటను విజేతలైన తునికి చెందిన క్రికెట్ టీంతో ఆవిష్కరించారు. అనంతరం హీరో అల్లరి నరేష్ ట్రాక్టర్ పోటీల్లో ప్రతిభ కనబరిచిన ఓ రైతుకు రూ.50వేల నగదు చెక్కును అందజేశారు. ఈ సందర్భంగా పెద్దఎత్తున తరలివచ్చిన అభిమానులను ఉద్దేశించి సినిమా హీరో అల్లరి నరేష్ మాట్లాడుతూ గోదావరి ప్రజల ఆత్మీయతా, అభిమానులు మరవలేనివన్నారు. తమ సినిమా అందరినీ ఆకట్టుకునేలా ఉంటుందని తెలిపారు. ఇప్పటివరకు అల్లరి నరేష్‌గా అభిమానిస్తున్న ప్రేక్షకులు ఈ సినిమాతో ఓ మంచి హీరో నరేష్‌గా తనను గుర్తిస్తారన్నారు. తుని ప్రాంతానికి చెందిన దర్శకుడు సుబ్బు మాట్లాడుతూ గ్రామీణ ప్రజల నేపథ్య కథను ఎంపిక చేసుకుని తుని పరిసర ప్రాంతంతోపాటు గోదావరి జిల్లాల్లో ఎక్కువ శాతం షూటింగ్ చేపట్టామన్నారు. ప్రతి ఒక్కరూ ఈ సినిమాను చూసి తనను ఆశీర్వదించాలని కోరారు. చిత్ర నిర్మాత రాజేష్ మాట్లాడుతూ సినిమా సూపర్ హిట్ కావడం ఖాయమని, పండుగ వాతావరణంలో సినిమా విజయోత్సవ వేడుక తునిలో నిర్వహిస్తామన్నారు. కార్యక్రమంలో తుని పరిసర ప్రాంతాలకు చెందిన పలువురు ప్రముఖులతోపాటు జగ్గంపేటకు చెందిన వీరాంజనేయ ఫిల్మ్స్ నిర్వాహకులు పాల్గొన్నారు.





ట్రాక్టర్ల పోటీలో విజేతలకు చెక్ అందజేస్తున్న సినీ హీరో అల్లరి నరేష్, దర్శకుడు సుబ్బు

తీరంలో ఉవ్వెత్తున ఎగసిపడుతున్న అలలు

- తీవ్ర వాయుగుండం హెచ్చరికలతో తీరప్రాంతంలో మత్స్యకారుల అప్రమత్తం

కొత్తపల్లి, డిసెంబరు 9(ఆంధ్రజ్యోతి): బంగాళాఖాతంలో తాజాగా ఏర్పడిన తీవ్రవాయుగుండం హెచ్చరికలతో తీరప్రాంత ప్రజలు అప్రమత్తమయ్యారు. ఉప్పాడ-అమీనబాద్ గ్రామాల మధ్య నిర్మాణంలో ఉన్న మినీ హార్బర్ సమీపంలో ఉన్న మాయాపట్నంలో గతంలో నిర్మించగా శిథిలమైన జియోట్యూబ్ టెక్నాలజీపైనుంచి సోమవారం అలలు ఉవ్వెత్తున ఎగసిపడుతూ దగ్గర్లో ఉన్న పంటభూముల్లోకి దూసుకుపోతున్నాయి. ఉప్పాడ పాతబజారు, సూరాడపేట, రామిశెట్టిపేట, కొత్తపట్నంవద్ద రాకాసి అలలు మత్స్యకారుల ఇళ్లల్లోకి జొరబడుతున్నాయి. సుబ్బంపేట, విద్యుత్‌ప్లాంటు, బీచ్‌రోడ్డులో పెద్దవంతెన స్థానే నిర్మించిన అప్రోచ్ వంతెనపై నుంచి కెరటాలు ఎగసిపడుతున్నాయి. తీవ్రఅల్పపీడన హెచ్చరికలు జారీ చేయడంతో మత్స్యకారులు తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. ఇటీవలకాలంలో రెండు, మూడు నెలల్లో సంభవించిన వరుస తుపాన్‌లు, అల్పపీడనాలతో జీవనోపాధికి ఆటంకం ఏర్పడిందని వారు వాపోతున్నారు. ప్రభుత్వం ఆదుకోవాలని కోరుతున్నారు.



కొత్తపల్లి మండలం ఉప్పాడలోని మాయాపట్నంవద్ద జియోట్యూబ్ పైనుంచి పొలంలోకి చేరిన సముద్ర నీరు

తాడోపేడో తేల్చుకుంటాం

రాజమహేంద్రవరంలో ఎల్ఐసీ ఏజెంట్ల మహాధర్నా




మహాధర్నాలో ఐక్యత చాటుతున్న యూనియన్ నేతలు, ధర్నా చేస్తున్న ఎల్ఐసీ ఏజెంట్లు

రాజమహేంద్రవరం సిటీ, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): పాలసీదారులకు, ఏజెంట్లకు నష్టం కలిగించేవిధంగా నిర్ణయాలు తీసుకున్న జీవిత బీమా సంస్థ యాజమాన్య వైఖరిని నిరసిస్తూ తూర్పుగోదావరి జిల్లా రాజమహేంద్రవరం మోరంపూడి ఎల్ఐసీ డివిజన్ కార్యాలయం వద్ద లియాఫి(అఖిల భారత జీవిత బీమా ఏజెంట్ల సమాఖ్య) ఆధ్వర్యంలో మహా ధర్నా చేశారు. ఉమ్మడి ఉభయగోదావరి జిల్లాలకు చెందిన ఏజెంట్లు పెద్ద ఎత్తున తరలివచ్చారు. యూనియన్ రాజమహేంద్రవరం డివిజన్ అధ్యక్షుడు రావుల మాధవరావు మాట్లాడుతూ దేశంలో 14 లక్షల మంది ఏజెంట్ల మనుగడకు నష్టం కలిగించే విధంగా యాజమాన్యం ప్రవర్తించడం సరికాదన్నారు. పాలసీదారుల ప్రయోజనాలకు ఇబ్బందులు వస్తాయన్నారు. ఎల్ఐసీ సెప్టెంబరు 30 వరకు అమల్లో ఉన్న పాలసీలన్నింటిని క్లోజ్ చేసి అక్టోబరు 1 నుంచి కొత్త పాలసీలను ప్రవేశ పెట్టారని.. అందులో ఏజెంట్లకు, కస్టమర్లకు ఇబ్బంది కలిగించే విషయాలను పొందుపర్చడం జరిగిందన్నారు. క్లా బ్యాక్ కమిషన్ స్ట్రక్చర్‌ని మార్చడం, మినిమం బీమా మొత్తం రూ.2 లక్షలకు పెంచడం, పాలసీల్లో వయోపరిమితిని తగ్గించడం, ప్రీమియం రేట్లు పెంచారని వాటన్నింటిని వ్యతిరేకిస్తున్నామన్నారు. తాడోపేడో తేల్చుకుంటామన్నారు. ఈసీ సభ్యుడు మస్తాన్ మాట్లాడుతూ తమ హక్కుల సాధనకు ఉద్యమిస్తున్నామని త్వరలో ఢిల్లీ జంతర్ మంతర్ వద్ద ధర్నా చేస్తామని తెలిపారు. మహాధర్నాలో వంగా త్రిమూర్తులు, దొరబాబు, సాంబ మూర్తి, పిండి రెడ్డమ్మ, అరవింద్, వేమూరి శ్రీనివాస్, వీవీఎస్ కృష్ణారావు, గండిబోయిన శ్రీనివాసరావు, తాడేపల్లిగూడెం, తణుకు, కొవ్వూరు, పాలకొల్లు, రావులపాలెం, అమలాపురం, రాజోలు, కాకినాడ, పెద్దాపురం, రామచంద్రపురం, రాజమహేంద్రవరం, జంగారెడ్డిగూడెం నుంచి 3వేల ఏజెంట్లు పాల్గొన్నారు.

బురదకోటలో పెద్ద పులి

- లేగదూడను చంపి తిన్న పులి
- పాదముద్రల గుర్తింపు..
- నిర్ధారించిన అటవీ అధికారులు
- భయాందోళనలో గిరిజన గ్రామాలు




పెద్దపులి అడుగుజాడలు, పులి దాడిలో మృతిచెందిన లేగదూడ

ప్రత్తిపాడు, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా ప్రత్తిపాడు మండలం బురదకోట అటవీప్రాంతంలో 2 రోజులుగా పెద్ద పులి సంచరిస్తోంది. బురదకోట పంచాయతీ పరిధిలోని బాపన్నదొర అటవీప్రాంతంలో లేగదూడపై దాడి చేసి చంపి తినేసింది. అటవీశాఖ అధికారులు సోమవారం పెద్దపులి సంచారంపై గాలింపు జరిపి దాని పాదముద్రలు గుర్తించడంతో పులి రాకను నిర్ధారించారు. బురదకోట చుట్టుపక్కల గిరిజన గ్రామాలను అప్రమత్తం చేశారు. రెవెన్యూ, పోలీస్ అధికారులకు సమాచారం ఇచ్చి సబ్‌ప్లాన్ ఏజెన్సీ గ్రామాల్లో పశువులు, మేకలను అటవీ ప్రాంతంలో మేపడానికి తరలించవద్దని ఆదేశాలు ఇచ్చారు. జిల్లా అటవీ అధికారి డి.రవీంద్రనాథ్ రెడ్డి ఆదేశాల మేరకు ఏలేశ్వరం ఫారెస్ట్ రేంజర్ కె.దుర్గారాంప్రసాద్, డీఆర్వో ఎం. జాన్సన్, క్షేత్రస్థాయి అటవీ సిబ్బంది పులి కోసం గాలింపు చర్యలు చేపట్టారు. బురదకోట, బాపన్నదొర, కె.మిర్చివాడ, కొండపల్లి, ఉలిగోగుల, అటవీ ప్రాంతంలో 6 ట్రాప్ కెమెరాలు ఏర్పాటుచేశారు. బురదకోట కేంద్రంగా రెండున్నర కిలోమీటర్ల దూరంలోని అటవీప్రాంతంలో సంచరిస్తున్నట్లు గుర్తించామని ఫారెస్ట్ రేంజర్ కె.దుర్గారాంప్రసాద్ తెలిపారు. సోమవారం సాయంత్రం నాటికి ట్రాప్ కెమెరాలకు పులి జాడ లభించలేదని చెప్పారు. పులి సంచరించిన ప్రదేశంలో పాదముద్రలను ల్యాబ్‌కు తరలించి అవి పులి పాదయాద్రలేనని నిర్ధారించడం జరిగిందని తెలిపారు. ఇది ఇలా ఉంటే బురద కోట అటవీ ప్రాంతంలో పులి సంచరించడం నిర్ధారణ కావడంతో ఒక్కసారిగా సబ్‌ప్లాన్ ఏజెన్సీ గ్రామాల్లో భయాందోళన నెలకొన్నాయి. పశువులను, గొర్రెలను, మేకలను సమీప అడవుల్లోకి పంపవద్దని, ప్రజలు గుంపులు గుంపులుగా తిరగాలని, ఒంటరిగా ఎవరూ అటవీప్రాంతంలోకి వెళ్లవద్దని కరపత్రాలు ముద్రించి పంపిణీ చేశారు.

పులి ఎలా వచ్చింది?

బురద కోట అటవీప్రాంతానికి పులి రాకపై గిరిజనులు అనేక సందేహాలు వ్యక్తం చేస్తున్నారు. పాపికొండలు, రిజర్వ్ ఫారెస్ట్ నుంచి రాజవొమ్మంగి అటవీప్రాంతం గుండా ఏలేశ్వరం అటవీప్రాంతానికి చొరబడిందని పలువురు చెబుతున్నారు.



ట్రాప్ కెమెరాలు ఏర్పాటు చేస్తున్న ఫారెస్ట్ అధికారులు

శంఖారావ యుగళం దంపతులకు...

కామధేను జాతీయ పురస్కారం



హైదరాబాద్‌లో జాతీయ పురస్కారాన్ని అందుకుంటున్న నరసింహారావు దంపతులు

పి.గన్నవరం/రాజమహేంద్రవరం డిసెంబరు 9(ఆంధ్రజ్యోతి): ఓంకార ప్రణవనాదాన్ని ధ్వనిస్తూ...అఖండ శంఖారావాన్ని పూరించడంలో జాతీయస్థాయిలో ఖ్యాతిని ఆర్జించి అనేక రికార్డులను, అవార్డులను, సువర్ణ ఘంటా కంకణాలు సాధించి అఖండ శంఖారావ యుగళంగా పేరు సాధించిన ఏపి ప్రత్యేక రక్షణదళం ఏపీఎస్పీఎఫ్ కమాండెంట్ డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా పి.గన్నవరానికి చెందిన డాక్టర్ కొండా నరసింహారావు, అలివేలు మంగాదేవి దంపతులు మరో జాతీయ పురస్కారాన్ని (విశ్వగురు వరల్డ్ రికార్డ్స్ కామధేను జాతీయ పురస్కారం) అందుకున్నారు. ఈ మేరకు ఈనెల 8వ తేదీన తెలంగాణ రాష్ట్రం హైదరాబాదు టూరిజం ప్లాజాలో జరిగిన కార్యక్రమంలో అధ్యాత్మిక రంగం విభాగంలో ఆ సంస్థ సీఈవో సత్యవోలు రాంబాబు ఆధ్వర్యంలో తెలంగాణ ఉన్నత న్యాయస్థానం జస్టిస్ నందా చేతులు మీదుగా ఆ దంపతులు అవార్డును స్వీకరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ శంఖంపై ఉన్న ఎనలేని మక్కువతో 38 ఏళ్లుగా సొంత ఖర్చులతో దేశవ్యాప్తంగా అనేక ప్రాంతాల్లో 6 వేలకు పైగా కార్యక్రమాల్లో మేం శంఖారావం పూరించాం. జాతీయ పురస్కారాల అవార్డుల ప్రదానోత్సవం మా శంఖారావంతోనే ప్రారంభించడం సంతోషంగాఉంది అని పేర్కొన్నారు.



కార్యక్రమంలో శంఖాన్ని పూరిస్తున్న దృశ్యం

13 నుంచి నన్నయ వర్శిటీలో

అథ్లెటిక్స్ ఛాంపియన్‌షిప్



బ్రోచర్ ఆవిష్కరిస్తున్న నన్నయ వీసీ శ్రీనివాసరావు

దివాన్‌చెరువు, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): తూర్పుగోదావరి జిల్లా ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం ప్రాంగణంలో యూనివర్శిటీ అథ్లెటిక్ ఛాంపియన్‌షిప్ కం విశ్వవిద్యాలయం జట్టు ఎంపికలు ఈనెల 13వ తేదీ నుంచి రెండురోజుల పాటు నిర్వహించనున్నట్టు ఉపకులపతి ఆచార్య వై.శ్రీనివాసరావు, రిజిస్ట్రార్, క్రీడాబోర్డు కార్యదర్శి ఆచార్య జి.సుధాకర్ తెలిపారు. విశ్వవిద్యాలయ చరిత్రలో తొలిసారిగా ఈ పోటీలను క్యాంపస్‌లో నిర్వహించనున్నామన్నారు. ఈ కార్యక్రమంలో పూర్వ ఉభయగోదావరి జిల్లాలోని అనుబంధ కళాశాలల నుంచి దాదాపు 250 మంది క్రీడాకారులు పాల్గొంటారని తెలిపారు. రన్నింగ్, జంపింగ్, త్రోయింగ్‌లలో 24 ఈవెంట్స్ మహిళలకు, పురుషులుకు నిర్వహించనున్నామన్నారు. కార్యక్రమంలో కార్యనిర్వాహక ఛైర్మన్ కొండ్రు సుబ్బారావు, కార్యనిర్వాహక కార్యదర్శి చొల్లంగి వెంకటసుబ్రహ్మణ్యం తదితరులున్నారు.

తాండవలో గల్లంతైన యువకుడి మృతదేహం లభ్యం

తుని రూరల్, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా తుని పట్టణ శివారు రేఖవానిపాలెంలో కాలు జారి తాండవ నదిలో గల్లంతైన యువకుడి మృతదేహం రెండు రోజుల తర్వాత కత్రావుల కొండ వద్ద పైకి తేలింది. మృతుడు రేఖవానిపాలెం గ్రామానికి చెందిన గెడ్డం సాయి (23)గా గుర్తించి తుని పట్టణ పోలీసులు శవ పంచనామాలు అనంతరం కుటుంబ సభ్యులకు మృతదేహాన్ని అప్పగించారు. మృతుడికి భార్య, 3 నెలల బాబు, తల్లిదండ్రులు ఉన్నారు.

లైసెన్స్ లేకుండా రెస్టారెంట్

సీజ్ చేసిన అధికారులు

కపిలేశ్వరపురం, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా కపిలేశ్వరపురం మండలం టేకి గ్రామంలో పంచాయతీ అనుమతి లేకుండా శ్రీ గణపతి రెస్టారెంట్ కొనసాగుతుంది. సోమవారం ఉదయం గ్రామస్తులు స్థానిక పంచాయతీ కార్యాలయానికి వెళ్లి రెస్టారెంటు నిర్వహణపై కార్యదర్శి కె.రామకృష్ణకు ఫిర్యాదు చేశారు. రెవెన్యూ, వైద్యశాఖ అధికారులు సమక్షంలో రెస్టారెంట్‌ను తెరిపించి చూడగా ఫ్రిడ్జ్‌లో నిల్వ మాంసం, జాయింట్లు, బిర్యాని వంటిని ఉండటాన్ని గుర్తించారు. వాటిని బయటకుతీయించి నిర్వాహకుడు కె.గంగవరం మండలం ఎండగండికు చెందిన గంటి గణపతి నుంచి వివరాలు సేకరించారు. శ్యాంపిల్స్‌ను మెడికల్ సిబ్బంది సేకరించారు. అనంతరం నిల్వ ఉన్న మాంసం, బిర్యాని, తదితర వాటిని సిబ్బందితో భూమిలో పూడ్చిపెట్టారు. లైసెన్స్ లేని కారణంగా రెస్టారెంట్‌ను సీజ్ చేసినట్టు గ్రామ కార్యదర్శి కె.రామకృష్ణ తెలిపారు.



టేకిలో రెస్టారెంట్‌ను సీజ్ చేస్తున్న అధికారులు

కొలిమేరు టు కాకినాడ

● కదులుతున్న రేషన్ మాఫియా డొంక ● పట్టుబడిన 69 క్వింటాళ్లు ● పీడీఎస్ బియ్యం గుట్టురట్టు



కొలిమేరులో ఒక రైస్ మిల్లులో పట్టుబడిన పీడీఎస్ బియ్యాన్ని పరిశీలిస్తున్న అధికారులు

తుని రూరల్, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా తుని మండలం కొలిమేరుగ్రామంలో పెద్ద ఎత్తున పట్టుబడుతున్న పీడీఎస్ బియ్యం అక్రమ రవాణా గుట్టు రట్టు అవుతుంది. 2రోజులు క్రితం పంట పొలాల్లో ఓ పౌల్ట్రీలో పెద్ద ఎత్తున పట్టుబడిన పీడీఎస్ డంప్‌ను రెవెన్యూ అధికారులు సీజ్ చేసి ఎంఎల్ఎస్ పాయింట్‌కు తరలించారు. సంబంధిత బియ్యం వివరాల కోసం ల్యాబ్‌కు తరలించగా కాకినాడ పోర్టు కేంద్రంగా విదేశాలకు అక్రమ రవాణా అవుతున్న బియ్యం, కొలిమేరులో పట్టుబడిన బియ్యం ఒకే రకానికి చెందినవిగా రిపోర్టులు రావడం సంచలనం రేకెత్తించింది. దీంతో రెవెన్యూ అధికారులు మరింత క్షుణ్ణంగా తనిఖీలు చేయగా కొలిమేరు గ్రామ శివారున ఓ వైసీపీ నాయకుడికి చెందిన రైస్ మిల్లులో పక్కా సమాచారంతో తనిఖీలు చేపట్టారు. దీంతో రైస్‌మిల్లులో తరలింపునకు సిద్ధంగా ఉన్న 69 క్వింటాళ్ల పీడీఎస్ బియ్యం పట్టుబడ్డాయి. సీజ్ చేసిన అధికారులు దీని వెనుక ఎవరు ఉన్నారనే కోణంలో ముమ్మర దర్యాప్తు కొనసాగిస్తున్నారు. మిల్లు నిర్వాహకులతో పాటుగా గొల్లప్రోలుకు చెందిన కొందరు వ్యక్తుల ప్రమేయం ఉన్నట్టు తెలుస్తుంది. ఇప్పటికే రూరల్ పోలీస్‌స్టేషన్ కోళ్లఫారంలో పట్టుబడిన బియ్యానికి సంబంధించి గొల్లప్రోలుకు చెందిన ఒక వ్యక్తిపై కేసు నమోదైంది. దీని వెనుక ఎవరు ఉన్నారు?ఎంత కాలం నుంచి జరుగుతున్నందనే దానిపై వివరాలు సేకరిస్తున్నట్టు ఎంఎస్‌వో వి.రాజు చెప్పారు. తనిఖీల్లో రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ తాతారెడ్డి, వీఆర్వో తదితరులున్నారు.

గురజనాపల్లిలో ఉమ్మడి జిల్లా రగ్బీ జట్ల ఎంపిక



ఎంపికైన ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా రగ్బీ బాలుర జట్టు



బాలికల జట్టు

కరప, డిసెంబరు 9(ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా కరప మండలం గురజనాపల్లి హైస్కూల్ క్రీడాప్రాంగణంలో సోమవారం ఉమ్మడి తూర్పుగోదావరిజిల్లా అండర్-15 సబ్‌జూనియర్ బాలురు, బాలికల రగ్బీ జట్ల ఎంపిక పోటీలను నిర్వహించారు. కరప, పిఠాపురం, కొమరగిరి, రామచంద్రపురం మండలాలకు చెందిన పలువురు క్రీడాకారులు ఈ ఎంపికల్లోపాల్గొన్నారు. వీరిలో ప్రతిభ చూపిన బాలురు, బాలికలను ఎంపికచేసి ఉమ్మడి జిల్లా జట్ల వివరాలను వెల్లడించారు. ఎంపికైన క్రీడాకారులు ఈనెల 15 నుంచి రెండు రోజుల బాటు గుంటూరు జిల్లా ఫిరంగిపురంలో జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో ఉమ్మడి జిల్లా తరఫున ప్రాతినిధ్యం వహిస్తారని హెచ్ఎం ఎం.సాయి మోహన్, వ్యాయామ ఉపాధ్యాయుడు కె.నాగలింగేశ్వరరావులు తెలిపారు. ఆయా జట్లకు ఎంపికైన క్రీడాకారులను అభినందించి రాష్ట్రస్థాయి పోటీల్లో సత్తా చాటాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో తూర్పుగోదావరి జిల్లా రగ్బీ అసోసియేషన్ అధ్యక్షుడు ఇమిడిశెట్టి నాగేంద్ర, లక్ష్మణ్, ఇన్‌చార్జ్ హెచ్ఎం వీవీ రమణమూర్తి, పద్మ, శేషుకుమారి, బొండా సతీష్, వంశీ, తదితరులు పాల్గొన్నారు.

బాలుర జట్టుకు ఎంపికైనవారు

డి.విజయకుమార్, వైఎస్ మణిదీప్, పి.వినయ్‌లోకేష్, కె.నాగవిష్ణు, వి.హేమంత్, ఎ.క్రాంతి, జె.గౌతమ్‌అజయ్‌కృష్ణ, కేఎంఎస్ సాగర్, అభిరామ్, డి.విజయ్‌కుమార్, జె.ప్రేమ్‌కుమార్, కేపి వలీషా, ఎ.గోవిందరాజు, జె.గౌతమ్.

బాలికల జట్టుకు ఎంపికైనవారు

వై.జ్యోతిచంద్రిక, ఎస్.వినీల, ఎన్.చాందిని, జి.తేజస్వీ, పి.వీరలత దివ్య, పి.శృతి, జి.మణిరాజేశ్వరి, టి.చంద్రకళ, కె.అమృత, పి.లోలాక్ష్యదేవి, డి.అలేఖ్య, ఎన్.దీపిక, కె.అఖిల, టి.వీరలక్ష్మి, పి.నిహారిక, బి.శిల్ప.

మహాసంస్థానంలో వైభవంగా లక్ష బిల్వార్చన




మహాసంస్థానంలో లక్ష బిల్వార్చన నిర్వహిస్తున్న రుత్వికులు, పూజల అనంతరం ప్రత్యేక అలంకరణ

పిఠాపురం, డిసెంబరు 9(ఆంధ్రజ్యోతి): దేశ వ్యాప్తంగా శ్రీపాదశ్రీవల్లభుల జన్మస్థానంగా ప్రసిద్ధిగాంచిన కాకినాడ జిల్లా పిఠాపురంలోని శ్రీపాదశ్రీవల్లభ మహాసంస్థానంలో జరుగుతున్న శ్రీపాద జయంతి సప్తాహ మహోత్సవాల్లో భాగంగా రెండో రోజు సోమవారం ప్రత్యేక పూజలు జరిగాయి. శ్రీపాదశ్రీవల్లభులు, దత్తాత్రేయస్వామి, నృసింహసరస్వతులకు లక్ష బిల్వార్చన నిర్వహించారు. వేదపండితుల మంత్రోశ్చారణల మధ్య రుత్విక్కుల బిల్వార్చన కార్యక్రమాలు జరిపించారు. అంతకుముందు మహాగణపతి పూజ, శ్రీపాదశ్రీవల్లభుల మహిమాన్విత దివ్య పాదపద్మములకు మహాన్యాసపూర్వక ఏకాదశ శతరుద్రాభిషేకం, శ్రీసూక్త, పురుషసూక్తములతో సహస్ర నామార్చన, రుత్విక్కులచే దత్తమూలమంత్ర అనుష్టానము, అగ్నిప్రతిష్ఠాపన, దత్తమంత్ర హోమం, వివిధ హారతులు. స్వామికి పల్లకిసేవ నిర్వహించారు. పూజాది కార్యక్రమాల్లో ఆలయ ఈవో ఆర్.సౌజన్య తదితరులు పాల్గొన్నారు.

పాదగయలో దత్త జయంతి మహోత్సవాలు ప్రారంభం

పిఠాపురంలోని పాదగయ క్షేత్రంలో స్వయంభువమూర్తిగా వెలసిన దత్తాత్రేయస్వామి దత్తజయంతి సప్తాహ మహోత్సవాలు సోమవారం నుంచి ప్రారంభమయ్యాయి. ఉదయం మహాగణపతిపూజ, కలశస్థాపనలు, రుత్విక్ వరణములు, పంచామృతాభిషేక సహిత రుద్రాభిషేకం, సహస్ర నామార్చన, మంగళహారతి, మంత్రపుష్పము, రుత్విక్కులచే దత్తమాల మంత్ర అనుష్ఠానం, గురుచరిత్ర పారాయణ, వేదపారాయణ, గణపతి అథర్వశీర్ష ఉపనిషత్ పారాయణ, విష్ణు, లలితా సహస్రనామ పారాయణలు జరిగాయి. సాయంత్రం అగ్నిప్రతిష్ఠాపన, దత్తమూల మంత్రహోమాదులు, సాయంత్రం సాయంకాల విశేష పుష్పార్చన, మంగళహారతి నిర్వహించారు. అనంతరం స్వయంభూ దత్తాత్రేయస్వామికి సహస్ర కలువ పుష్పార్చన నిర్వహించి ప్రత్యేక అలంకారం చేశారు. ఈ కార్యక్రమాల్లో ఆలయ ఈవో కాట్నం జగన్మోహన శ్రీనివాస్, సూపరింటెండెంట్ వీరభద్రరావు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థి భవితకు పునాది అభ్యాసనం దిశానిర్దేశం

ఎఫ్ఎల్ఎన్ కార్యక్రమం రాష్ట్ర కన్సల్టెంట్ బాలకృష్ణ



సమావేశంలో మాట్లాడుతున్న బాలకృష్ణ

దివాన్‌చెరువు, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): విద్యార్థి భవిష్యత్‌ను పునాది అభ్యాసనం దిశానిర్దేశం చేస్తుందని ఎఫ్ఎల్ఎన్ కార్యక్రమం రాష్ట్ర కన్సల్టెంట్ టి.బాలకృష్ణ అన్నారు. తూర్పుగోదావరి జిల్లా రాజానగరం మండలం కొండగుంటూరు సత్యసాయి పరిమళ పాలిటెక్నిక్ కళాశాలలో ఏర్పాటు చేసిన పునాది అక్షరాస్యత, సంఖ్యాశాస్త్రం (ఎఫ్ఎల్ఎన్) 4వ దశ ఆరు రోజుల శిక్షణ సోమవారం ప్రారంభమైంది. ఈ కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా విచ్చేసి మాట్లాడుతూ 2030 నాటికి సాధించాల్సిన స్థిరమైన అభివృద్ధి లక్ష్యాల్లో భాగంగా ప్రతి విద్యార్థి తప్పనిసరిగా నాణ్యమైన విద్యను సాధించాల్సి ఉందన్నారు. ఇదే విషయాన్ని నూతన జాతీయ విద్యావిధానం కుడా వివరిస్తుందన్నారు. పునాది అక్షరాస్యత, సంఖ్యాశాస్త్రం విద్యార్థి జీవితానికి బంగారు బాటలు వేస్తుందన్నారు. ప్రథమ్ రాష్ట్ర కోఆర్డినేటర్ గీతారమ్య మాట్లాడుతూ ప్రాథమిక పాఠశాలల ఉపాధ్యాయులు ముఖ్యంగా ఒకటో తరగతి బోధించే ఉపాధ్యాయులు విద్యార్థుల భవిష్యత్తుకు మార్గదర్శకులన్నారు. శిక్షణా కార్యక్రమం కోఆర్డినేటర్, కోనసీమ జిల్లా సమగ్రశిక్ష అకడమిక్ మానటరింగ్ అధికారి పి.రాంబాబు మాట్లాడుతూ పునాది అభ్యసనం.. చదవడం, రాయడం, గణితంలో ప్రాథమిక నైపుణ్యాలను సూచిస్తుందని చెప్పారు. మూడేళ్ల నుంచి ఎనిమిది సంవత్సరాల వరకూ పాఠశాల విద్యావిధానంలో పునాదిస్థాయిగా పేర్కొన్నారు. నాలుగో బ్యాచ్‌లో కాకినాడ, కోనసీమ, తూర్పుగోదావరి, అల్లూరి సీతారామరాజు జిల్లాలకు చెందిన 250 మంది ఉపాధ్యాయులు ఆరు రోజుల పాటు శిక్షణ పొందనున్నట్టు తెలిపారు. ఈ సందర్భంగా సమగ్రశిక్ష ఏఎల్ఎస్ కోఆర్డినేటర్ డి.రమేష్‌బాబు, ఎంఈవోలు సీహెచ్‌వీ సోమిరెడ్డి, వాసంశెట్టి నాగేశ్వరి, కేఆర్పీలు ఈశ్వర్, కొండలరావు, గౌతమ్‌కృష్ణ ఎఫ్ఎల్ఎన్ ప్రాధాన్యతను వివరించారు. సమావేశంలో వెన్యూ ఆర్గనైజర్ పవన్, ప్రథమ్ కాకినాడ, కోనసీమ జిల్లా కోఆర్డినేటర్లు వంశీకృష్ణ, జీవన్, 17 మంది డీఆర్పీలు పాల్గొన్నారు.

వాడపల్లిలో సినీనటుడు శుభలేఖ సుధాకర్ పూజలు



వేంకటేశ్వరస్వామి ఆలయంలో సినీనటుడు శుభలేఖ సుధాకర్

ఆత్రేయపురం, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా వాడపల్లి శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయంలో సోమవారం సాయంత్రం సినీనటుడు శుభలేఖ సుధాకర్ స్వామివారిని దర్శించుకుని పూజలు నిర్వహించారు. అర్చక బృందం ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. అనంతరం స్వామి వారిని దర్శించుకుని వేద ఆశీర్వచనం అందుకున్నారు. స్వామివారి తీర్థప్రసాదాలు స్వీకరించారు. అలాగే ర్యాలి జగన్మోహిని కేశవస్వామి ఆలయంలో సుధాకర్ స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు.

రూ.లక్ష విరాళం



విరాళం ఇచ్చిన దాతకు స్వామివారి చిత్రపటం అందిస్తున్న ఈవో

వెంకన్న ఆలయంలో వకుళమాత అన్నదాన భవన నిర్మాణానికి బొమ్మూరుకు చెందిన ఎం.శివ, సత్యవతి దంపతులు రూ.లక్ష విరాళం అందజేశారు. వివిధ సేవల ద్వారా రూ.1,12,932 ఆదాయం లభించినట్టు ఉప కమిషనర్, ఈవో నల్లం సూర్య చక్రధరరావు తెలిపారు. హుండీలో సమర్పించిన కానుకల లెక్కింపు ఈనెల12తేదీన నిర్వహిస్తామన్నారు.

తిరునక్షత్ర ఉత్సవాలు ప్రారంభం



పల్లకీ మహోత్సవం



ఆళ్వార్‌కు అలంకరణ

ఆత్రేయపురం, డిసెంబరు 9(ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా వాడపల్లి శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయంలో వేంచేసి ఉన్న ఆళ్వార్ సన్నిధిలో తిరుమంగైయళ్వార్ తిరునక్షత్ర పూజలు సోమవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. 5రోజుల పాటు ఈ ఉత్సవాలను నిర్వహించనున్నారు. తొలిరోజు ప్రకారోత్సవం, దవిడవేదపారాయణం తదితర కార్యక్రమాలను నిర్వహించారు. ఆలయ ఉపకమిషనర్ నల్లం సూర్యచక్రధరరావు ఏర్పాట్లునిర్వహించారు.

కొలిమేరులో టేకు దుంగలు పట్టివేత

తుని రూరల్, డిసెంబరు 9(ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా తుని మండలం కొలిమేరు గ్రామంలో సోమవారం ఓ వైసీపీ ప్రజా ప్రతినిధికి చెందిన పొలంలో పెద్ద ఎత్తున టేకు దుంగలు పట్టుబడ్డాయి. నిబంధనలకు విరుద్ధంగా టేకు చెట్లను నరికి దుంగలు దాచడంపై భూ యజమానిపై చర్యలు చేపట్టనున్నట్టు ఫారెస్ట్ అధికారులు తెలిపారు.



పట్టుబడిన టేకు దుంగలను పరిశీలిస్తున్న ఫారెస్ట్ బీట్ అధికారులు

కాకినాడ
• కాకినాడ సిటీ • రూరల్ • పిఠాపురం • పెద్దాపురం

భీమేశ్వరాలయంలో విశేష పూజలు

సామర్లకోట, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): సామర్లకోట కుమార రామ భీమేశ్వరాలయంలో మార్గశిరమాసం తొలిసోమవారం మహా పర్వదినం పురస్కరించుకుని సోమవారం విశేష పూజలు నిర్వహించారు. ఈవో నీలకం ఠం ఆధ్వర్యంలో పండితులు స్వామివారికి అభిషేక పుష్పార్చన పూజలు నిర్వహించారు. స్వామి,అమ్మవార్లను పట్టువస్త్రాలతో అలంకరించారు.

కూటమి అభ్యర్థుల విజయానికి కృషి

జనసేన కాకినాడ జిల్లా ఇన్‌చార్జి తుమ్మల బాబు


సమావేశంలో మాట్లాడుతున్న తుమ్మల బాబు

పెద్దాపురం, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి) : సాగునీటి సంఘాల ఎన్నికల్లో కూటమి అభ్యర్థుల విజయానికి పరస్పరం సహకరించుకోవాలని జనసేన కాకినాడ జిల్లా ఇన్‌చార్జి తుమ్మల రామస్వామి (బాబు) అన్నారు. స్థానిక జనసేన పార్టీ కార్యాలయంలో సోమవారం జనసైనికులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. నాయకత్వ లక్షణాలతో పార్టీని ముందుకు తీసుకువెళ్లాలని కర్యకర్తలకు దిశానిర్దేశం చేశారు. సాగునీటి సంఘాల ఎన్నికల్లో కూటమి అభ్యర్థుల విజయానికి సమష్టిగా కృషిచేయాలన్నారు. జనసేన నాయకులు దాసు శివబాబు, పాఠంశెట్టి నాగరాఘవ తదితరులు పాల్గొన్నారు.

వైద్య శిబిరం ప్రారంభం

ఉచిత వైద్య శిబిరాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని జనసేన కాకినాడ జిల్లా ఇన్‌చార్జ్ తుమ్మల రామస్వామి (బాబు) అన్నారు. మండలంలోని చంద్రమాంపల్లి గ్రామంలో టీడీపీ నేత రేలంగి బుజ్జి ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన ఉచిత వైద్య శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. ట్రినిటి ఆసుపత్రి (కాకినాడ) పర్యవేక్షణలో ఈ శిబిరం నిర్వహించి సుమారు 400 మందికి వైద్య పరీక్షలు చేసి మందులు అందజేశారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే చినరాజప్ప తనయుడు నిమ్మకాయల రంగనాగ్, కొత్తిం వెంకట శ్రీనివాసరావు, మొయిళ్ల కృష్ణమూర్తి, వెంకటేశ్వరరావు, తుమ్మల నాని, రేలంగి వెంకట్రావు, కొమ్మిరెడ్డి బుజ్జి, ఎస్ఐ మౌనిక ఉన్నారు.

గొల్లప్రోలులో ఎస్డీఆర్ఎఫ్ బృందాల మాక్‌డ్రిల్




మాక్‌డ్రిల్ నిర్వహిస్తున్న మూడవ బెటాలియన్ ఎస్డీఆర్ఎఫ్ బృందం సభ్యులు

గొల్లప్రోలు, డిసెంబరు 9(ఆంధ్రజ్యోతి): గొల్లప్రోలులోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఏపీఎస్పీ మూడవ బెటాలియన్ ఎస్డీఆర్ఎఫ్ బృందాలు సోమవారం మాక్‌డ్రిల్ నిర్వహించాయి. తుఫాన్లు, వరదల సమయాల్లో, రోడ్డు, రైలు ప్రమాదాలు జరిగినప్పుడు, అగ్నిప్రమాదాలు, గ్యాస్‌లీకేజీలు సంభవించినప్పుడు ఏ విధంగా వ్యవహరించాలనే విషయంపై మాక్‌డ్రిల్ ద్వారా చేసి చూపించారు. విద్యార్థులు, ఉపాధ్యాయులకు అవగాహన కల్పించారు. ప్రమాదాల నివారణా చర్యలపై వివరించారు. ఎస్డీఆర్ఎఫ్ టీమ్ ఇన్‌చార్జి, అసిస్టెంట్ కమాండెంట్ ఎం.మోహనరావు, ఆర్ఐ వి.రాము, ఆర్ ఎస్ఐలు కె.శివకుమార్, వై.రఘు, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోళ్లపై తనిఖీలు


ఉండూరులో తనిఖీలు చేస్తున్న భావన

సామర్లకోట, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): రైతుల నుంచి ప్రభుత్వం ధాన్యం కొనుగోలు చేస్తున్న ప్రక్రియలో రైతులు ఎదుర్కొంటున్న పలు సమస్యలపై అధ్యయనం చేసేందుకు జిల్లా అసిస్టెంట్ కలెక్టర్ భావన సోమవారం ఉండూరు, హుస్సేన్‌పురం, నవర గ్రామాల్లో రైతు సేవా కేంద్రాలను, పలు రైస్‌మిల్లుల్లో తనిఖీలు నిర్వహించారు. ధాన్యం ప్రోక్యూర్‌మెంట్‌లో భాగంగా కూపన్లు జారీ, ఎఫ్‌టీవో జారీ, ట్రక్‌షీట్ జనరేషన్, ఎకనా లెడ్జిమెంట్స్ పెండింగ్ తదితర అంశాలకు చెంది అసిస్టెంట్ కలెక్టర్ క్షుణ్ణంగా పరిశీలించారు. ఎకనాలెడ్జిమెంట్స్ పెండింగ్ నకు చెంది జాప్యాన్ని అసిస్టెంట్ కలెక్టర్ పలు మిల్లులను, రైతు సేవా కేంద్రాల సిబ్బందిని ప్రశ్నించారు. ఎఫ్‌టీవో పెండింగ్ నిర్ణీత గడువులో పూర్తి చేయాలని ఆర్ఎస్‌కె సిబ్బందిని, కస్టోడియన్ సిబ్బందిని ఆదేశించారు. సామర్లకోట ఏవో ఐ.సత్య, వీఆర్వోలు రాంజీ, వాసు, వ్యవసాయ సిబ్బంది, రైస్‌మిల్లుల యజమానులు ఉన్నారు.

శిథిలావస్థకు జీజీహెచ్‌లో భవనాలు

ట్విన్ ఆపరేషన్ థియేటర్‌లో పెచ్చులూడిన శ్లాబ్
కొత్త భవనాలు నిర్మించాలని కోరుతున్న వైద్యులు

జీజీహెచ్(కాకినాడ), డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జీజీహెచ్‌లో వేలాదిమంది పేద రోగులకు వైద్యసేవలు అందుతుంటాయి. ఇంత ముఖ్యమైన ఈ పెద్దాస్పత్రిలో భవనాలు మాత్రం శిథిలావస్థకు చేరుకుని శ్లాబ్‌లు పెచ్చులూడి కింద పడుతుండడం ఆందోళన కలిగిస్తోంది. వైద్యులకు ఇక్కడ ఇబ్బందికరమైన పరిస్థితి ఎదురవుతోంది. ఇందుకు శనివారం జరిగిన సంఘటనే ఉదాహరణ. ఆస్పత్రికి అతి ప్రధానమైనది ట్విన్ ఆపరేషన్ థియేటర్(టీఓటీ). ఇక్కడ పలు విభాగాలకు సంబంధించిన మేజర్ శస్త్రచికిత్సలను నిర్వహిస్తుంటారు. పలువురు సర్జరీ వైద్యనిపుణులు కొంతమంది విధినిర్వహణలో ఉండగా మరికొందరు రెస్ట్‌లో ఉంటారు. ఈ భవంతి 1960-65 దశకంలో నిర్మించడంతో ప్రస్తుతం భవంతితోపాటు మెడికల్ విభాగం పరిపాలనా విభాగం కూడా శిథిలావస్థకు చేరాయి. అంతకంటే ముందు నిర్మించిన బ్రిటీష్ కాలం నాటి మాతా, శిశు విభాగం మాత్రం చెక్కు చెదరకుండా ఉంది. కాగా పరిపాలనా విభాగం, మెడిసిన్ విభాగం, సర్జరీ విభాగాల్లో అక్కడక్కడ శ్లాబ్‌లు పెచ్చులు ఊడుతుండడంతో వైద్యులు, వైద్య సిబ్బంది, రోగులు వారి సహాయకులు భయాందోళనకు గురవుతున్నారు. టీఓటీలోని వైద్యులు వినియోగించే బాత్రూంలో శనివారం శ్లాబ్ నుంచి పెద్ద పెచ్చు పడడంతో ఆ కింద ఉన్న వెస్ట్రన్ కమోడ్ తునాతునకలైంది. అంతకుముందే ఓ వైద్యురాలు బాత్రూంకి వెళ్లి తిరిగి వచ్చిన వెంటనే ఈ సంఘటన జరగడంతో వైద్యుల గుండెలు ఒక్కసారిగా జల్లుమన్నాయి. ఇప్పటికైనా శిథిలావస్థలో ఉన్న భవనాలు నూతనంగా నిర్మించాలని పలువురు కోరుతున్నారు.


టీఓటీలో శ్లాబ్ పెచ్చులూడి ఛిద్రమైన కమోడ్

సమానపనికి సమాన వేతనం ఇవ్వాలి

సమ్మెలోకి మున్సిపల్ ఇంజనీరింగ్ వర్కర్లు


పిఠాపురంలో ధర్నా నిర్వహిస్తున్న వర్కర్లు

పిఠాపురం, డిసెంబరు 9(ఆంధ్రజ్యోతి): సమానపనికి సమాన వేతనం ఇవ్వాలని డిమాండ్ చేస్తూ పిఠాపురం పురపాలక కార్యాలయంలో కాంట్రాక్టు, అవుట్‌సోర్సింగ్ పద్ధతిలో పనిచేస్తున్న మున్సిపల్ వర్కర్లు సోమవారం నుంచి సమ్మెలోకి దిగారు. విధులను బహిష్కరించి మున్సిపల్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా యూనియన్ ప్రతినిధులు రాంబాబు, చెట్టుబత్తిన సురేష్ మాట్లాడుతూ ఏళ్ల తరబడి కాంట్రాక్టు, అవుట్‌సోర్సింగ్ పద్ధతిలో ఇంజనీరింగ్ విభాగంలో పనిచేస్తున్న తమను క్రమబద్ధీకరించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. వేతన బకాయిలు చెల్లించాలని, టెక్నికల్, నాన్ టెక్నికల్ సిబ్బంది వేతనాలు పెంచాలని డిమాండ్ చేశారు. తమ డిమాండ్లు పరిష్కరించేవరకూ ఆందోళన కొనసాగుతుందని స్పష్టం చేశారు. కాగా ఇంజనీరింగ్ వర్కర్లు పిఠాపురం నియోజకవర్గ జనసేన ఇన్‌చార్జి మర్రెడ్డి శ్రీనివాసరావును కలిసి తమ డిమాండ్లపై వినతిపత్రం అందజేశారు. కాగా వారి ఆందోళనకు మున్సిపల్ కోఆప్షన్ సభ్యుడు గండేపల్లి బాబీ, కౌన్సిలర్లు బోను దేవ, పెదపాటి రాజేష్ తదితరులు సంఘీభావం తెలియజేశారు. ఆందోళనలో పెంకే రాంబాబు, మురాలశెట్టి అచ్చిరాజు, కరణం శ్రీను, కోవెల శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

గొల్లప్రోలు: గొల్లప్రోలు నగరపంచాయతీ పరిధిలో పనిచేస్తున్న ఇంజనీరింగ్ వర్కర్లు సోమవారం నుంచి సమ్మెకు దిగారు. పంచాయతీ కార్యాలయం వద్ద శిబిరం ఏర్పాటు చేశారు. తాము సమ్మెలోకి వెళుతున్నట్టు కమిషనరు రవికుమార్‌కు నోటీసు అందజేశారు. వేతనాలు పెంచాలని, 15 ఏళ్ల సర్వీసు పూర్తి చేసుకున్నవారిని క్రమబద్ధీకరించాలని, సీనియార్టీ ప్రాతిపదికన జీతాలు చెల్లించాలని, హెచ్‌ఆర్ పాలసీని అమలు చేయాలని ఏపీ మున్సిపల్ ఇంజనీరింగ్ వర్కర్ల అసోసియేషన్ ప్రతినిధులు డిమాండ్ చేశారు.

సామర్లకోట: సామర్లకోట మున్సిపల్ ఇంజనీరింగ్ వర్కర్స్ తమ న్యాయమైన సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ సోమవారం సమ్మెబాట పట్టారు. మున్సిపల్ కార్యాయలం ఎదుట ధర్నా శిబిరం నిర్వహించి విధులను బహిష్కరించి నిరసన దీక్షలలో పాల్గొన్నారు. రాష్ట్ర మున్సిపల్ ఇంజనీరింగ్ వర్కర్స్ యూనియన్ పిలుపుమేరకు సామర్లకోటలో సామర్లకోట యూనియన్ అధ్యక్షుడు ఉండవిల్లి వివి.రామరాజు, కార్యనిర్వాహక కార్యదర్శి పులపకూర రామకృష్ణ, ఉప ప్రధాన కార్యదర్శి కాటంరెడ్డి ఏసు, కోశాధికారి నక్కా రత్నరాజు ఆధ్వర్యంలో సుమారు 22 మంది వర్కర్స్ చుండ్రు వెంకటరాజేష్, కాకాడ నాగార్జున, లంక శ్రీహరి, గరగ స్వామి, మామిడాల కొండబాబు, భాగ్యలక్ష్మి, భూదేవి వెంకట సుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొన్నారు.

దేవాలయాల నిర్వహణ హిందువులకు అప్పగించాలి

కరప, డిసెంబరు 9(ఆంధ్రజ్యోతి): గుడి, గుడిలో లింగాలను మింగేస్తున్న దేవదాయ, ధర్మదాయశాఖను రద్దుచేసి, దేవాలయాల నిర్వహణను హిందువులకు అప్పగించాలని హిందూ అభయ సేన అధ్యక్షుడు స్వామి రాధామనోహర్‌దాస్ పేర్కొన్నారు. కరపమండలం అరట్లకట్ట గ్రామంలో ఆదివారం రాత్రి జరిగిన హిందూ సమ్మేళన సభలో ఆయన ముఖ్యఅతిథిగా ప్రసంగించారు. దేవదాయ, ధర్మదాయశాఖ రాక్షస, ధర్మనాశన శాఖగా మారిపోయిందని ఆవేదన వ్యక్తంచేశారు. గడప లోపల కులాన్ని ఉంచుకుని, గడప దాటితే హిందువుగా గర్జించాలన్నారు. జనవరి 5న విజయవాడలో జరిగే హైందవ శంఖారావ సభను విజయవంతంచేయాలని విజ్ఞప్తిచేశారు. కార్యక్రమంలో విశ్వహిందూపరిషత్ ప్రతినిధులు వెలుగుబంట్ల శ్రీనివాస్, యరమాటి సతీష్, బ్రహ్మజీ, కంచుమర్తి పెద్దఅప్పాజీ, సమరసత సేవా ఫౌండేషన్ జిల్లా ధర్మప్రచారక్ పడాల రఘు, కాదా సత్యనారాయణ, గుండు విశ్వనాథం, ముమ్మిడి పెదకాపు, బీజేపీ నాయకులు రెడ్డి రమణేశ్వరరావు, పుట్టా వీరప్రసాద్‌గాంధీ, ఆర్ఎస్ఎస్ నాయకులు రామారావు, మల్లిబాబు పాల్గొన్నారు.



సభలో మాట్లాడుతున్న రాధామనోహర్‌దాస్

నేటి నుంచి రెవెన్యూ గ్రామసభలు

కొత్తపల్లి, డిసెంబరు 9(ఆంధ్ర జ్యోతి): మండలంలో ఈనెల 10 నుంచి జనవరి 4 వరకు రెవెన్యూ గ్రామసభలు నిర్వహిస్తున్నట్టు తహశీల్దార్ జి.చిన్నారావు చెప్పారు. డిసెంబరు 10న అమీనబాద్, 11న గోర్స, 12న ఇసుకపల్లి, 13న కొమరగిరి, 17న కొండెవరం, 18న అమరవల్లి, 19న కొత్తపల్లి, 20న కుతుకుడుమిల్లి, 21న మూలపేట, 23న నాగులాపల్లి, 24న పొన్నాడ, 28న రమణక్కపేట, 31న ఉప్పాడ, జనవరి 2న సుబ్బంపేట, 3న వాకతిప్ప, 4న యండపల్లిలో రెవెన్యూ గ్రామసభలు ఏర్పాటుచేసినట్టు పేర్కొన్నారు. ఆయా గ్రామ సభల్లో కేవలం భూ సమస్యలే కాకుండా ఇతర సమస్యలపై కూడా అర్జీలు దాఖలు చేయవచ్చన్నారు. గ్రామాల్లో అదే రోజు సచివాలయం ద్వారా దరఖాస్తు చేసుకున్న వివిధ రకాల సర్టిఫికెట్లకు ఎటువంటి రుసుము తీసుకోకుండా మంజూరు చేస్తారని, ఈ అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

'రెవెన్యూ సదస్సులను విజయవంతం చేయాలి'

పిఠాపురం, డిసెంబరు 9(ఆంధ్రజ్యోతి): రెవెన్యూ, భూ సంబంధమైన సమస్యల పరిష్కారం కోసం ఈనెల 10 నుంచి నిర్వహించే సదస్సులను విజయవంతం చేయాలని, అందులో ఎక్కువ మంది రైతులు పాలుపంచుకునేలా కృషి చేయాలని తహశీల్దారు వీవీ గోపాలకృష్ణ సూచించారు. పిఠాపురం తహశీల్దారు కార్యాలయంలో వీఆర్వోలు, సర్వేయర్లు, రెవెన్యూ సిబ్బందితో సోమవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ రెవెన్యూ సదస్సుల లక్ష్యాలపై రైతులకు ముందుగా వివరించాలన్నారు. సదస్సుల్లో వచ్చే వినతులు, ఫిర్యాదులు అన్నింటిని ఆన్‌లైన్ చేసిన పరిష్కరించడం జరుగుతుందని తెలిపారు. వచ్చే నెల 8 వరకూ 24 గ్రామాల్లో సదస్సులు జరుగుతాయని చెప్పారు. మండల సర్వేయర్ సత్యనారాయణ, ఆర్ఐ వెంకటేష్ తదితరులు ఉన్నారు.

కాకినాడ రూరల్‌లో 13 నుంచి....

సర్పవరం జంక్షన్, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): కాకినాడ రూరల్ మండలంలో రెవెన్యూ సదస్సులు ఈనెల 13 నుంచి 27వ తేదీ వరకు నిర్వహిస్తున్నట్టు ఎస్ఎల్ఎస్ కుమారి తెలిపారు. గ్రామస్థాయిలో భూసమస్యల పరిష్కారం కోసం ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న రెవెన్యూ సదస్సులు రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈనెల 13న ఉదయం 10 నుంచి 1గంట వరకు నేమాంలో, 17న పండూరులో, 18న తిమ్మాపురంలో నిర్వహించడం జరుగుతుందన్నారు. 19న తమ్మవరం, పెనుమర్తి, 20న చీడిగ, గంగనాపల్లి, 21న రేపూరు, కొవ్వాడ, 24న కొవ్వూరు, తూరంగి,26న సర్పవరం, సూర్యారావుపేట, 27న రమణయ్యపేట, వాకలపూడి గ్రామాల్లో రెవెన్యూ సదస్సులు జరుగుతాయన్నారు. టీమ్-1కు తన ఆధ్వర్యంలో, టీమ్-1 డిప్యూటీ తహశీల్దార్ ఆర్.కల్యాణ చక్రవర్తి ఆధ్వర్యంలో గ్రామసభలు జరుగుతాయని, భూ యాజమానులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

చర్చకు ముందుకు రాని వైసీపీ నేతలు

● మాజీ ఎమ్మెల్యే వర్మ సవాల్‌పై మౌనం
● అవినీతి బయటపడుతుందనే పారిపోయారన్న వర్మ


పిఠాపురం ఉప్పాడ సెంటర్‌లో వైసీపీ నేతల కోసం ఎదురుచూస్తున్న మాజీ ఎమ్మెల్యే వర్మ

పిఠాపురం, డిసెంబరు 9(ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రులుగా పనిచేసిన తండ్రి కొడుకులు రాజశేఖరరెడ్డి, జగన్‌లు, వైసీపీ నేతలు కాకినాడ సెజ్ విషయంలో పాల్పడిన అవినీతి, అక్రమాలపై బహిరంగ చర్చకు రావాలని పిఠాపురం మాజీ ఎమ్మెల్యే టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి ఎస్వీఎస్ఎన్ వర్మ చేసిన సవాల్‌కు వైసీపీ నాయకులు నుంచి మౌనమే సమాధానమైంది. పిఠాపురం పట్టణంలోని ఉప్పాడ సెంటర్‌లో సోమవారం సాయంత్రం బహిరంగ ప్రెస్‌మీట్, చర్చకు వస్తే వైసీపీ ఆరోపణలు, వాస్తవంగా సెజ్‌లో జరిగిన పరిణామాలపై చర్చిద్దామని మాజీ మంత్రులు కురసాల కన్నబాబు, దాడిశెట్టి రాజా, మాజీ ఎంపీ వంగా గీతావిశ్వనాథ్‌లకు వర్మ సవాల్ చేశారు. ఈనేపథ్యంలో సోమవారం మధ్యాహ్నం తెలుగుదేశం పార్టీ కార్యాలయం నుంచి నాయకులు, కార్యకర్తలతో కలిసి ప్రదర్శనగా ఉప్పాడ సెంటర్‌కు తరలివచ్చారు. ముగ్గురు వైసీపీనేతల కోసం మూడు కుర్చీలు ఏర్పాటు చేసి తానొక కుర్చీలో వర్మ కూర్చొన్నారు. గంటకు పైగా ఎదురుచూసినప్పటికి వైసీపీ నేతలు ఎవ్వరూ చర్చకు రాలేదు. వారి నుంచి ఎటువంటి స్పందన రాకపోవడంతో వర్మ మాట్లాడుతూ వైసీపీ నేతలు చంద్రబాబు తదితరులపై చేసిన ఆరోపణలు అవాస్తవాలని తేలిపోయిందన్నారు. చర్చకు వస్తే ఎక్కడ తాము చేసిన అవినీతి, అక్రమాలు బయటపడతాయనే వైసీపీ నేతలు రాకుండా పారిపోయారని ఎద్దేవా చేశారు.

తప్పుడు ప్రచారాలు మానుకోవాలి

చర్చకు రమ్మంటే పత్తా లేకుండా పోయిన వైసీపీ నేతలు ఇకనైనా చంద్రబాబు, కూటమి ప్రభుత్వంపై తప్పుడు ప్రచారం మానుకోవాలని మాజీ ఎమ్మెల్యే వర్మ హితవు పలికారు. రైతులపై తెలుగుదేశం పార్టీ కేసులు పెట్టిందని ఆరోపణలు చేస్తున్న వైసీపీ నేతలు రాజశేఖరరెడ్డి సీఎంగా ఉండగా బలవంతంగా భూ ములు సేకరించడమే గాక, పోలీసులనుప్రయోగించి అక్రమ కేసులు బనాయించిన విషయాన్ని గుర్తించుకోవాలన్నారు. రాజశేఖరరెడ్డి బలవంతంగా భూములు లాక్కొంటే చంద్రబాబు ముఖ్యమంత్రి అయిన తర్వాత ఏరువాకలో ఇచ్చిన హామీకి అనుగుణంగా రైతులకు అదనంగా రూ.160కోట్లు చెల్లించారని గుర్తుచేశారు. ఇకన్నైనా తప్పుడు ఆరోపణలు మాని వేసి అవినీతి, అక్రమాలను ఒప్పుకోవాలని వైసీపీ నేతలు సూచించారు.

ట్రాఫిక్ స్తంభన
రెండున్నర గంటలు తీవ్ర ఇక్కట్లు



సామర్లకోట, డిసెంబరు 9(ఆంధ్రజ్యోతి): సామర్లకోట-కాకినాడ ప్రధాన రహదారిలో ముత్యాలమ్మ విగ్రహం వద్ద రోడ్డుపై ఒక లారీ సాంకేతిక లోపంతో సోమవారం రాత్రి నిలిచి పోయింది. దీంతో అటు కాకినాడ వైపు వీకేరాయపురం వరకు, ఇటు సామర్లకోట అయిదు తూముల వరకూ వందలాది వాహనాలు నిలిచిపోయాయి. ట్రాఫిక్ పోలీసులు గంటన్నర వరకూ కనిపించలేదు. పలు పాఠశాలల విద్యార్థులు (చిన్నారులు) బస్సుల్లో తీవ్ర ఇక్కట్లకు గురయ్యారు. చిన్నారులను వెంట తీసుకెళ్లే అవకాశాలు కూడా లేకపోవడంతో విద్యార్థుల తల్లిదండ్రులు సామర్లకోట ఓవర్ బ్రిడ్జిపె వారి కోసం ఎదురుచూశారు. రాత్రి 6.30 నుంచి రాత్రి 9గంటల వరకు వాహనదారుల అవస్థలు పడ్డారు. వర్ణణాతీతంగా సామర్లకోటలో ట్రాఫిక్ నియంత్రించేందుకు ప్రత్యేక ట్రాఫిక్ పోలీసు విభాగం ఉన్నప్పటికీ వారంలో మూడు రోజులు ప్రజలకు ట్రాఫిక్ సమస్యలు తప్పడం లేదు.

ఎయిడ్స్ స్టాల్ ప్రారంభం

కార్పొరేషన్(కాకినాడ), డిసెంబరు 9(ఆంధ్రజ్యోతి): ప్రపంచ ఎయిడ్స్ దినోత్సవంలో భాగంగా ఆర్టీసీ బస్టాండ్‌లో సోమవారం ఏర్పాటుచేసిన ఐఈసీ హెచ్‌ఐవీ ఎయిడ్స్ స్టాల్‌ను డిస్ట్రిక్ట్ మెడికల్ అండ్ హెల్త్ ఆఫీసర్ డాక్టర్ నరసింహనాయక్, డాక్టర్ ఆర్.రమేష్ ప్రారంభించారు. హెచ్‌ఐవీ నియంత్రణకు జిల్లా స్థాయిలో ముగ్గుల పోటీలు నిర్వహించి బహుమతులు అందిస్తామన్నారు.

సమస్యలు త్వరితగతిన పరిష్కరించాలి


సమస్యలు వింటున్న కమిషనర్ భావన

కార్పొరేషన్(కాకినాడ), డిసెంబరు 9(ఆంధ్రజ్యోతి): డయల్ యువర్ కమిషనర్, ప్రజా వ్యతిరేక ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థకు వచ్చే సమస్యల అర్జీల పరిష్కారానికి సత్వరం చొరవ చూపాలని కాకినాడ నగరపాలక సంస్థ కమిషనర్ భావన నగరపాలక అధికారులను ఆదేశించారు. సోమవారం కాకినాడ నగరపాలక సంస్థ కార్యాలయంలో ఉదయం 9.30నుంచి 10.30వరకు నిర్వహించిన డయల్ యువర్ కమిషనర్ కార్యక్రమానికి ఆరుగురు ఫోన్ చేసి సమస్యలు వివరించారు. అనంతరం నిర్వహించిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థలో 14సమస్యలపై కమిషనర్ భావన వినతులు స్వీకరించారు. ప్రజల సమస్యల పరిష్కారానికి అధికారులు కృషి చేయాలని సూచించారు. కార్యక్రమంలో అదనపు కమిషనర్ కెటి సుధాకర్, నగరపాలక సంస్థ కార్యదర్శి శ్రీకాంత్‌రెడ్డి, డిప్యూటీ కమిషనర్ కె.మనోహర్, ఎస్ఈ కామేశ్వరరావుపాల్గొన్నారు.

వాటర్ వర్క్స్ సిబ్బంది ఆందోళన

కార్పొరేషన్(కాకినాడ),డిసెంబరు9(ఆంధ్రజ్యోతి): కనీస వేతనాలు అమలు చేయాలని డిమాండ్ చేస్తూ సోమవారం నుంచి ఏపీ మున్సిపల్ వాటర్ వర్క్స్ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంతో స్థానిక విక్టోరియా వాటర్‌వర్క్స్ వద్ద ఆందోళన నిర్వహిస్తున్నారు. డిమాండ్లను పరిష్కరించక పోవడంతో ఆందోళనకు దిగారు.

జ్ఞానాన్ని పెంపొందించుకోవాలి



మాట్లాడుతున్న వీసీ కేవీఎస్‌జీ మురళీకృష్ణ

జేఎన్టీయూకే, డిసెంబరు 9(ఆంధ్రజ్యోతి): ప్రపంచంలో ఉత్తమమైన వ్యసనం జ్ఞానాన్ని పెంపొందిచుకోవడమేనని జేఎన్టీయూకే ఉపకులపతి కేవీఎస్‌జీ మురళీకృష్ణ అన్నారు. వర్సిటీలోని యూసీఈకే సీఎస్ఈ విభాగం, నేషనల్ ఇనిస్టిట్యూట్ ఫర్ మైక్రో, స్మాల్, మీడియం ఎంటర్‌ప్రైజస్ సంయుక్త ఆధ్వర్యంలో సెనెట్ హాల్లో ఈనెల 13వరకు జనరేషన్ ఏఐ ఫర్ డేటా ఎనలిటిక్స్‌పై వారం రోజులు ఇంజనీరింగ్ విద్యార్థులకు అడ్వాన్స్‌డ్ ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్ స్కిల్ డెవలప్‌మెంట్ ప్రోగ్రామ్‌ను నిర్వహించనున్నారు. ఈకార్యక్రమం సోమవారం ప్రారంభం కాగా ముఖ్యఅతిథిగా ఇన్‌ఛార్జి వీసీ మురళీకృష్ణ, గౌరవ అతిథులుగా రిజిస్ట్రార్ రవీంద్రనాథ్, ప్రిన్సిపాల్ మోహన్‌రావు, ఇండియన్ సర్వర్స్ సీఈవో సాయిసతీష్ పాల్గొన్నారు. అడ్వాన్స్‌డ్ ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్ స్కిల్ డెవలప్‌మెంట్ ప్రోగ్రామ్‌కు సీఎస్ఈ విభాగాధిపతి ప్రొఫెసర్ ఎన్.రామకృష్ణయ్య కన్వీనర్‌గాను, ఉషాదేవి, సురేఖలు సమన్వయకర్తలుగా వ్యవహరిస్తురాస్తున్నారు. ఈసందర్భంగా వీసీ మాట్లాడుతూ విద్యార్థి దశ నుంచే ప్రతీ ఒక్కరూ ధూమపానం, మద్యపానం, డ్రగ్స్‌కు దూరంగా ఉంటే జీవితంలో ఉన్నతస్థాయికి చేరుకోవచ్చన్నారు. రిసోర్స్‌పర్సన్‌లు, అధ్యాపకులు, వర్సిటీ, అనుబంధ కళాశాలల విద్యార్థులు పాల్గొన్నారు.

నేడు వైసీపీ ఉమ్మడి జిల్లా సమావేశం

కార్పొరేషన్(కాకినాడ), డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): కాకినాడ సూర్య కళామందిర్‌లో మంగళవారం వైసీపీ ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా సమావేశం ఏర్పాటు చేయనున్నట్లు పిఠాపురం వైసీపీ ఇన్‌చార్జి, మాజీ ఎంపీ వంగా గీతా విశ్వనాథ్ ఒక ప్రకటనలో తెలిపారు.ఈసమావేశానికి వైసీపీ రీజనల్ కోఆర్డినేటర్ బొత్స సత్యనారాయణ ముఖ్యఅతిథిగా హాజరవుతారన్నారు. మూడు జిల్లాల పార్టీ అధ్యక్షులు, నియోజకవర్గ, పార్లమెంటు సమన్వయకర్తలు, ఎమ్మెల్సీలు, ముఖ్య నేతలు పాల్గొంటారన్నారు.

ఆర్టీసీ డ్రైవర్‌కు సత్కారం

కార్పొరేషన్(కాకినాడ), డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): విశాఖపట్నంలోని కైలాసగిరి పోలీస్ గ్రౌండ్‌లో సోమవారం జరిగిన నేషనల్ అథ్లెటిక్స్ పోటీలు జరుగుతున్న సందర్భంగా జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో అనేక బంగారు పతకాలు సాధించిన కాకినాడ జిల్లా కాకినాడ డిపోకు చెందిన ఆర్టీసీ డ్రైవర్ మండపల్లి శ్రీనివాసరావును డీజీపీ, ఆర్టీసీ ఎండీ ద్వారకా తిరుమలరావు సన్మానించి అభినందించారు. కార్యక్రమంలో ఈడీ(ఏ) రవివర్మ, ఆర్టీసీ చైర్మన్ కొనకళ్ల సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

మద్యం తాగి వాహనాలు నడిపిన వారికి జైలు

కాకినాడ క్రైం, డిసెంబరు 9(ఆంధ్రజ్యోతి): మద్యం తాగి వాహనాలు నడుపుతూ పట్టుబడిన 33 మందికి కాకినాడ మూడో స్పెషల్ జ్యుడిషియల్ సెకండ్ క్లాస్ మేజిస్ట్రేట్ వి.నరసింహరావు జైలు, జరిమానా విధిస్తూ సోమవారం తీర్పుచెప్పారు.కాకినాడ ట్రాఫిక్ సీఐలు, ఎన్.రమేష్ డి.రామారావులు బృందాలతో ఆదివారంరాత్రి డ్రంకన్ డ్రైవ్ నిర్వహించారు. మద్యం సేవించి వాహనాలు నడుపుతున్న వారిని బ్రీత్ ఎనలైజర్లతో పరిక్షించగా 33మంది పట్టుబడ్డారు. కోర్టులో హాజ రుపర్చగా 16మందికి ఒక్కొక్కరికి 2రోజుల చొప్పున జైలు శిక్ష, మరో 17మందికి ఒక్కొక్కరికి రూ.10వేలు చొప్పున జరిమానా విధించినట్టు సీఐ రమేష్ తెలిపారు.

అనంతలక్ష్మి దంపతులకు సత్కారం

సర్పవరం జంక్షన్, డిసెంబరు 9(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర శెట్టిబలిజ కార్పొరేషన్ చైర్మన్ కుడుపూడి సత్తిబాబు సోమవారం వలసపాకల్లో మాజీ ఎమ్మెల్యే పిల్లి అనంతలక్ష్మి, టీడీపీ కోఆర్డినేటర్ సత్యనారాయణ మూర్తి దంపతులను మర్యాదపూర్వకంగా కలిసి సత్కరించారు. శెట్టిబలిజ సామాజిక వర్గం నుంచి తనకు కార్పొరేషన్ ఛైర్మన్ పదవి రావడానికి కృషి చేసిన సత్తిబాబు దంపతులకు ఛైర్మన్ కుడిపూడి సత్తిబాబు కృతజ్ఞతలు తెలిపారు. అసెంబ్లీ ఎన్నికల్లో టీడీపీ రూరల్ నియోజకవర్గ అబ్జర్వర్‌గా తాను ఉన్న సమయంలో పిల్లి దంపతులు సహకారం అందించారని కితాబిచ్చారు.

'ఆలస్యమైనా ద్వారంపూడి జైలుకు పోవడం ఖాయం'


మాట్లాడుతున్న టీడీపీ నగర అధ్యక్షుడు వీరు

కాకినాడ సిటీ, డిసెంబరు 9(ఆంధ్రజ్యోతి): రేషన్ బియ్యం, డ్రగ్స్ అక్రమ రవాణాకు కాకినాడ పోర్టును అడ్డాగా మార్చుకున్న మాజీ ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డికి అన్ని దారులు మూసుకుపోయాయని, కాస్త ఆలస్యమైనా ద్వారంపూడి జైలుకు పోవడం ఖాయమని తెలుగుదేశం పార్టీ నగర అధ్యక్ష, కార్యదర్శులు మల్లిపూడి వీరు, తుమ్మల రమేష్ హెచ్చరించారు. సోమవారం జిల్లా తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో వారు విలేకరులతో మాట్లాడారు. కొమరగిరి లేఅవుట్‌లో పేదల ఇళ్ల స్థలాల కొనుగోలు, చదును పనుల్లో ద్వారంపూడి కోట్ల రూపాయల అవినీతికి పాల్పడ్డారన్నారు. వైసీపీ ఐదేళ్ల పాలనలో కాకినాడ పోర్టు నుంచి రేషన్ బియ్యం, డ్రగ్స్ అక్రమ రవాణాకు పాల్పడి నేడు దీనిపై ఆధారపడిన 10వేలమంది కార్మికులు రోడ్డునపడే స్థితికి తీసుకువచ్చారన్నారు. టీడీఆర్ బాండ్ల వ్యవహారంలో చంద్రశేఖరరెడ్డి అవినీతికి పాల్పడ్డారన్నారు. కార్పొరేష న్‌కు చెందాల్సిన ఆదాయానికి తూట్లు పొడుస్తూ టీడీఆర్ బాండ్ల పేరుతో కోట్ల రూపాయల ప్రజాధనాన్ని దోచుకున్నారన్నారు. ద్వారంపూడి అవినీతిని కూకటి వేళ్లతో పెకలించి కాకినాడ నుంచి తరిమికొడతామని ఆనాడే చంద్రబాబు, పవన్‌కల్యాణ్ చెప్పారన్నారు. ఎమ్మెల్యే కొండ బాబు అవినీతికి పాల్పడ్డారని లేనిపోని బురద జల్లుతున్న ద్వారంపూడి తన అవినీతిపై బహి రంగ చర్చకు రావాలని సవాల్ విసిరారు. టీడీపీ నాయకులు గదుల సాయిబాబు, ఎంఏ తాజుద్దీన్, బచ్చు శేఖర్, బంగారు సత్యనారా యణ, చింతలపూడి రవి, అమలకంటి బలరామ్, కళింకోట చంద్రశేఖర్, కోడూరి కుమారస్వామి పాల్గొన్నారు.

'శెట్టిబలిజ మహా సభను విజయవంతం చేయాలి'


కరపత్రాన్ని ఆవిష్కరిస్తున్న దృశ్యం

కాకినాడసిటీ, డిసెంబరు 9(ఆంధ్రజ్యోతి): రాజమహేంద్రవరంలో ఈనెల 15న జరిగే శెట్టిబలిజ పితామహుడు దొమ్మేటి వెంకటరెడ్డి విగ్రహావిష్కరణ, శెట్టిబలిజ మహా దన్ను సభను విజయవంతం చేయాలని రాష్ట్ర శెట్టిబలిజ కార్పొరేషన్ చైర్మన్ కుడుపూడి సత్తిబాబు పిలుపునిచ్చారు. స్థానిక రామారావుపేటలోని శెట్టిబలిజ కల్యాణ మండపంలో సోమవారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో మహాసభ కరపత్రాన్ని ఆవిష్కరించారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ ఆర్థికంగా వెనుకబడిన గీత కులాలకు రిజర్వేషన్లు కల్పించింది చంద్రబా బు ప్రభుత్వమేనని గర్వంగా చెప్పుకుంటామన్నారు. శెట్టిబలిజ కులస్తులకు మద్యం షాపుల్లో 10శాతం కేటాయింపులు చేసిన ముఖ్యమంత్రి చంద్రబాబుకు రుణపడి ఉంటామన్నారు. ఈమహాసభ, విగ్రహావిష్కరణ కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు రాష్ట్ర వ్యాప్తంగా శెట్టిబలిజ కులస్తులు హాజరు కావాలని ఆయన కోరారు. సమావేశంలో శెట్టిబలిజ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు చొల్లంగి వేణుగోపాల్, సంఘం నేతలు నులుకుర్తి వెంకటేశ్వరరావు, చొల్లంగి వీరబాబు, రెడ్డి రామ్‌పల్లంరాజు, సివిల్ సప్లయిస్ కార్పొరేషన్ డైరెక్టర్ కడలి ఈశ్వరి, శెట్టిబలిజ కార్పొరేషన్ డైరెక్టర్లు వొమ్మి బాలాజీ, చప్పిడి వెంకటేశ్వరరావు, నాయకులు పెంకే వెంకటేష్ పాల్గొన్నారు.

జగ్గంపేట

• జగ్గంపేట • తుని • ప్రత్తిపాడు

బంగ్లాదేశ్‌లో హిందువులపై దాడికి నిరసన

జగ్గంపేట, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): బంగ్లాదేశ్‌లో ఆధ్యాత్మిక గురువు చిన్మయ్ క్రిష్ణదాస్ అక్రమ అరెస్టుకు వ్యతిరేకంగా సోమవారం జనసేన ర్యాలీ చేపట్టింది. జగ్గంపేట సోమాలమ్మ తల్లి దేవాలయం నుంచి లయన్స్ క్లబ్ భవనం వరకు జరిగిన ప్రదర్శనలో జనసేన ఇన్‌చార్జి తుమ్మలపల్లి రమేష్ తదితరులు పాల్గొన్నారు.

రంపచోడవరం

• రంపచోడవరం • మారేడుమిల్లి • దేవీపట్నం • రాజవొమ్మంగి • అడ్డతీగల • గంగవరం • వై రామవరం • చింతూరు • కూనవరం • వీఆర్ పురం • ఎటపాక



సమావేశంలో మాట్లాడుతున్న ఐటీడీఏ పీవో సింహాచలం

'అభివృద్ధి పనులను సకాలంలో పూర్తి చేయాలి'

రంపచోడవరం, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): ఏజెన్సీలో వివిధ శాఖల ద్వారా చేపట్టిన అభివృద్ధి పనులను వేగవంతం చేసి సకాలంలో పూర్తి చేయాలని ఐటీడీఏ పీవో కట్టా సింహాచలం ఆదేశించారు. సోమవారం ఆయన ఐటీడీఏ కార్యాలయంలో గిరిజన సంక్షేమం, గృహ నిర్మాణ, రోడ్లు, భవనాల, విద్యుత్, పంచాయతీ రాజ్, స్పెషల్ మైనర్ ఇరిగేషన్ శాఖల అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా పీవో మాట్లాడుతూ మారుమూల గ్రామాల్లో చేపట్టిన అభివృద్ధి పనులను నిబంధనల ప్రకారం పూర్తి చేయాలన్నారు. మంజూరైన పనులు, పూర్తయిన పనులు, ఇంకా టెండర్లు వేయాల్సిన పనులపై మండలాల వారీగా సమీక్షించారు. ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ గాబ్రియేల్, డీఈలు సతీష్, చైతన్య, మల్లికార్జునరావు, దివాకర్, పి.వెంకటరమణ, నాగరాజు, ఏఈలు శ్రీనివాసరావు, వంశీ, ఆచార్యులు పాల్గొన్నారు.

ముమ్మరంగా వాహనాల తనిఖీ

మోతుగూడెం, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): పర్యాటకం ముసుగులో గంజాయి స్మగ్లర్లు సంచరించే అవకాశం ఉండడంతో పోలీసులు ప్రత్యేక నిఘా పెట్టారు. మోతుగూడెం ఎస్‌ఐ శివనారాయణ పర్యవేక్షణలో పోలీస్‌స్టేషన్ వద్ద, చెక్ పోస్టు వద్ద సోమవారం వాహనాలను క్షుణ్ణంగా తనిఖీ చేశారు. అనుమానితులను ఆరాతీస్తూ గుర్తింపు కార్డులను పరిశీలించి వదిలేస్తున్నారు. తనిఖీల్లో సీఆర్పీఎఫ్ 42వ బెటాలియన్ సిబ్బంది, సివిల్ పోలీసులు పాల్గొన్నారు.



కారును ఆపి తనిఖీ చేస్తున్న పోలీసులు

ఆదివాసీ సంఘ భవన నిర్మాణానికి వినతి

వై.రామవరం, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): వై.రామవరంలో ఆదివాసీ ఐక్య వేదిక చైతన్య సంఘం భవన నిర్మాణానికి స్థలాన్ని పరిశీలించి అనుమతి మంజూరు చేయాలని సోమవారం ఆదివాసీ జిల్లా అధ్యక్షుడు వెదుర్ల లచ్చిరెడ్డి, సభ్యులు తహసీల్దార్ వేణుగోపాల్‌కు వినతిపత్రం సమర్పించారు. గిరిజన ప్రాంతాల్లో నకిలీ ఎస్టీ కుల ధ్రువీకరణ పత్రాలతో చలామణి అవుతున్న వారిని అరికట్టాలని కోరారు. తహసీల్దారుకు దుశ్శాలువా కప్పి సత్కరించారు. ఆదివాసీ నాయకులు గుడ్ల త్రిమూర్తులు, ముర్ల సూరిబాబు, పల్లాల అబ్బాయిరెడ్డి, పుడిగి లక్ష్మణరావు, పండురెడ్డి తదితరులు పాల్గొన్నారు.



తహసీల్దారు వేణుగోపాల్‌ను సత్కరిస్తున్న ఆదివాసీ సంఘ సభ్యులు

'నిబంధనల ప్రకారం థియేటర్ నడపాలి'

రాజవొమ్మంగి, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ నిబంధనల ప్రకారం సినిమా థియేటర్ నడపాలని రంపచోడవరం సబ్ కలెక్టర్ కల్పశ్రీ సూచించారు. స్థానిక వెంకటేశ్వర థియేటర్‌ను రీమోడల్ చేశారు. కన్వర్షన్ పర్మిషన్‌కు దరఖాస్తు చేసుకున్నారు. దీంతో సోమవారం సబ్ కలెక్టర్ థియేటర్‌ను తనిఖీ చేసి పలు రికార్డులను పరిశీలించారు. ఆమె వెంట తహసీల్దారు అల్లు సత్యనారాయణ, రెవెన్యూ సిబ్బంది ఉన్నారు.



థియేటర్‌ను తనిఖీ చేస్తున్న సబ్ కలెక్టర్ కల్పశ్రీ



గర్భిణులకు పోషకాహారంపై అవగాహన కల్పిస్తున్న వైద్యులు

'గర్భిణులు పోషకాహారం తీసుకోవాలి'

అడ్డతీగల, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): గర్భిణులు పోషకాహారం తీసుకోవడం ద్వారా సుఖ ప్రసవానికి అవకాశం ఎక్కువ అని, పుట్టబోయే పిల్లలు ఆరోగ్యవంతంగా ఉంటారని అడ్డతీగల సీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ పండా సతీష్ పేర్కొన్నారు. సోమవారం స్థానిక ప్రభుత్వ ఆసుపత్రిలో గైనకాలజిస్ట్ డాక్టర్ శశికళ ఆధ్వర్యంలో 86 మంది గర్భిణులకు వైద్య పరీక్షలు నిర్వహించి ఆహార నియమాలపై అవగాహన కల్పించారు. డాక్టర్ ప్రసన్నదేవి, సిబ్బంది నాగ మణి, ఆదిలక్ష్మి, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం

ఎటపాక, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): నల్లకుంట పంచాయతీ రాఘవపురంలో పొడియం మనీషా ఇటీవల అనారోగ్యంతో మృతి చెందింది. ఆ కుటుంబానికి జమాల్‌ఖాన్ చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో రూ.5వేలు ఆర్థిక సహాయం అందజేశారు. సోమవారం మనీషా తల్లిదండ్రులకు నగదును టీడీపీ నాయకులు కణితి మధు, పెనబల్లి వెంకన్నబాబు అందించారు. కొమరం నాగేష్, కల్లూరి రామకృష్ణ, జమాల్‌ఖాన్ చారిటబుల్ ట్రస్టు సభ్యులు పాల్గొన్నారు.



ఆర్థిక సాయం అందజేస్తున్న దృశ్యం



ఎమ్మెల్యేకు వినతుల వెల్లువ

రంపచోడవరం, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): రంపచోడవరం ఎమ్మెల్యే మిరియాల శిరీషదేవి సోమవారం తన క్యాంపు కార్యాలయంలో ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. సమస్యలు పరిష్కారమయ్యేలా కృషి చేస్తానని హామీ ఇచ్చారు.

14న మాల ఉద్యోగుల ఆత్మీయ సమ్మేళన సభ

రంపచోడవరం, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): గుంటూరు జిల్లా తాడేపల్లిలో ఈ నెల 14న జరిగే మాల ఉద్యోగుల ఆత్మీయ సమ్మేళన సభను విజయవంతం చేయాలని కన్వీనర్ మాదే రామచంద్రరావు పిలుపునిచ్చారు. ఆర్టికల్ 341 వర్గీకరణపై వ్యతిరేకించాలని, ఎస్సీ బ్యాక్‌లాగ్ ఉద్యోగ సాధన కోసం ప్రభుత్వం ఒత్తిడి తీసుకువచ్చేలా మాల ఉద్యోగులు అధిక సంఖ్యలో తరలిరావాలన్నారు.

'ఆదిత్య'లో అటల్ ఫ్యాకల్టీ డెవలప్‌మెంట్ ప్రోగ్రాం

గండేపల్లి, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): మండలంలోని సూరంపాలెం ఆదిత్య విశ్వ విద్యాలయం మెకానికల్ ఇంజనీరింగ్ విభాగం ఆధ్వర్యంలో ఫ్యాకల్టీ డెవలప్‌మెంట్ ప్రోగ్రాం (ఎఫ్‌డీపీ) సోమవారం ప్రారంభమైందని డాక్టర్ ఎం.శ్రీనివాసరెడ్డి తెలిపారు. మొదటి రోజు ఐఐటీ (చెన్నయ్)కి చెందిన డాక్టర్ మణివణ్ణన్ 'పీవీ హైబ్రిడ్ అండ్ అటానమస్ వెహికల్స్' అంశంపై ప్రసంగించారు. డిప్యూటీ ప్రో-ఛాన్సలర్ డాక్టర్ ఎం.శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ ఈ నెల 14వ తేదీ వరకు జరిగే ప్రోగ్రాంలో ప్రఖ్యాత విశ్వవిద్యాలయాల నుంచి నిష్ణాతులైన ప్రొఫెసర్లు విచ్చేసి ఉపన్యాసాలు ఇస్తారన్నారు. ఉప కులపతి డాక్టర్ ఎంబీ శ్రీనివాస్, డాక్టర్ ఎస్.రమాశ్రీ, రిజిస్ట్రార్ డాక్టర్ జి.సురేష్, స్కూల్ ఆఫ్ ఇంజనీరింగ్ డీన్ డాక్టర్ డోలా ఎస్.సంజయ్, డీన్ డాక్టర్ పీఎస్ రంజిత్, డాక్టర్ ఎ.శరవణ్, డాక్టర్ జేడీ వెంకటేష్ పాల్గొన్నారు.



అటల్ ఫ్యాకల్టీ ప్రోగ్రామ్‌కు హాజరైన ప్రముఖులు

విత్తనాల దుకాణం సీజ్

ఏలేశ్వరం, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): మండలంలోని లింగంపర్తిలో ఎరువులు, పురుగుల మందులు, విత్తనాల విక్రయ దుకాణాలను సోమవారం వ్యవసాయ సహాయ సంచాలకురాలు పి.మాధవి, ఏవో కరుణాకర్ సిబ్బందితో కలిసి తనిఖీ చేశారు. గుల్లింకల శేషగిరికి చెందిన గొడౌన్లో లైసెన్స్ లేకుండా వరి విత్తనాలు నిల్వ ఉంచి రైతులకు విక్రయిస్తున్నట్టు గమనించారు. రూ.20,40 విలువైన 17 బస్తాలు (25 కిలోలు)ను సీజ్ చేసి 6(ఎ) కేసు నమోదు చేశారు. తనిఖీల్లో మండల వ్యవసాయ అధికారి బి.జ్యోతి, వీఆర్వోలు సీహెచ్ నాగేశ్వరరావు, వై.లక్ష్మి పాల్గొన్నారు.

అన్న క్యాంటీన్‌లో పేదలకు భోజనం

జగ్గంపేట, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): స్థానిక ఎన్టీఆర్ విగ్రహం వద్ద టీడీపీ ఆధ్వర్యంలో ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ నేతృత్వంలో నిర్వహిస్తున్న అన్న క్యాంటీన్‌లో సోమవారం గండేపల్లి మండలం మురారి ఉప సర్పంచ్, టీడీపీ యువ నేత జాస్తి వసంత్ ఆర్థిక సహాయంతో అన్నదానం నిర్వహించారు. టీడీపీ జిల్లా అధ్యక్షుడు జ్యోతుల నవీన్ పేదలకు భోజనం వడ్డించారు. పార్టీ నేతలు ఎస్వీఎస్ అప్పలరాజు, మారిశెట్టి భద్రం, జీను మణిబాబు, దేవరపల్లి మూర్తి, సర్పంచ్ అడబాల రామాంజనేయులు, రేఖ బుల్లిరాజు, సర్వసిద్ది లక్ష్మణరావు, చింతమనేని చంటిబాబు, కానుకొలను సతీష్, దాపర్తి సీతారామయ్య, ఉండవల్లి అఖిల్ తదితరులు పాల్గొన్నారు.



అన్నం వడ్డిస్తున్న జ్యోతుల నవీన్



బచ్చలమల్లి మూవీ టీం సందడి

జగ్గంపేట, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): బచ్చలమల్లి మూవీ టీం తునిలో ఈవెంట్‌కి వెళ్తుండగా వీరాంజనేయ ఫిలిమ్స్ అధినేతలు కొత్త చిన వీరభద్రరావు(శివ), బూర్లు సాయి జగ్గంపేటలో ఘన స్వాగతం పలికారు. నాగేశ్వర థియేటర్ సెంటర్లో హీరో అల్లరి నరేష్, ప్రొడ్యూసర్ రాజేష్ దండ, డైరెక్టర్ సుబ్బు మంగాదేవి సందడి చేశారు. భారీ సంఖ్యలో అభిమానులు తరలివచ్చి హీరో అల్లరి నరేష్‌తో సెల్ఫీలు దిగారు.

రైసుమిల్లుపై అధికారుల దాడులు

గండేపల్లి, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): స్థానికంగా ఒక రైసుమిల్లుపై ఆదివారం అర్ధరాత్రి విజిలెన్స్, రెవెన్యూ అధికారులు దాడి చేశారు. మిల్లులో ఉన్న బియ్యాన్ని పరిశీలించారు. తహసీల్దారు శ్రీనివాస్, ఎంఎస్‌వో నాగబాబు మాట్లాడుతూ మిల్లులో పీడీఎస్ బియ్యం అక్రమ నిల్వలు ఉన్నట్టు సమాచారం రావడంతో తనిఖీ చేశామని, లేవని గుర్తించామన్నారు. పరిశీలనలో ఎస్‌ఐ శివనాగబాబు, సిబ్బంది పాల్గొన్నారు.



భక్తులకు పంపిణీ చేసేందుకు పూజా సామగ్రిని ప్యాకింగ్ చేస్తున్న మహిళలు

శ్రీరామ పాదుకా పట్టాభిషేకానికి ఏర్పాట్లు పూర్తి

ప్రత్తిపాడు, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): ప్రత్తిపాడు నరేంద్రగిరి కొండపై ఆంధ్ర భద్రాద్రి పేరుతో నిర్మాణం జరుగుతున్న రామాలయంలో త్రిదండి చినజీయర్ స్వామి ఆధ్వర్యంలో ఈ నెల 12న శ్రీరామ పాదుకలకు పట్టాభిషేకం నిర్వహించడానికి శ్రీరామ సేవక్ కమిటీ సభ్యులు ఏర్పాట్లు పూర్తి చేశారు. భక్తులకు అందజేసే పూజా సామగ్రిని వర్తక సంఘం అధ్యక్షుడు అనంతపల్లి శ్రీనివాస్ నివాసంలో మహిళలు ప్యాకింగ్ చేస్తున్నారు. చినజీయర్ స్వామి, అహోబిల రామానుజ జీయర్ స్వామిలకు స్వాగత ఏర్పాట్లు చేస్తున్నారు. అనంతపల్లి శ్రీనివాస్ స్వగృహంలో బుధవారం రాత్రి చినజీయర్ స్వామి ప్రత్యేకంగా విశ్రాంతి తీసుకునేందుకు ఏర్పాట్లు చేశారు. 5వేల మంది భక్తులు, భజన బృందాలు, కోలాట బృందాలతో గ్రామాల్లో కరసేవ నిర్వహించనున్నారు. కమిటీ సభ్యులు అనంతపల్లి శ్రీను, గోగుల బుజ్జి, రెడ్నం రాజా, పుష్పారెడ్డి, మదినే నూకరాజు, ఆంజనేయుడు, పలువురు యువకులు సోమవారం సాయంత్రం నరేంద్రగిరిపై జై శ్రీరామ్ నినాదాలతో ప్రదర్శన నిర్వహించారు.

నీటి సంఘాల ఎన్నికలపై సమీక్ష

కోటనందూరు, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): మండలంలోని 21 నీటి సంఘాల ఎన్నికల్లో విజయం సాధించేందుకు కార్యకర్తలు కృషి చేయాలని టీడీపీ మండల శాఖ అధ్యక్షుడు గాడి రాజుబాబు కోరారు. సోమవారం కేపీ మల్లవరంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ కష్టపడే వారికి పార్టీలో పదవులు దక్కుతాయన్నారు. మాజీ ఎంపీపీ డి.చిరంజీవి రాజు, పెనుముచ్చు నాగేశ్వరరావు, అంకంరెడ్డి బుల్లిబాబు, చింతకాయల కొండబాబు, చిటికెల సత్యనారాయణ, అంకంరెడ్డి రమేష్, షేక్ నవాబ్ జానీ, లగుడు సత్యనారాయణమూర్తి తదితరులు పాల్గొన్నారు.



కేపీ మల్లవరంలో సమావేశమైన టీడీపీ నేతలు

సుభద్రమ్మపేటలో పంట కోత ప్రయోగం

ఆశాజనకంగా వరి దిగుబడులు

తుని రూరల్, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): మండలంలోని సుభద్రమ్మపేట గ్రామంలో వ్యవసాయ శాఖ అధికారి అశోక్‌కుమార్ ఆధ్వర్యంలో రైతు బొడ్డేటి కుమారి పొలంలో పంట కోత ప్రయోగం చేపట్టారు. ఆర్‌జీఎల్ 2537 రకంలో ఎకరానికి 35 బస్తాల దిగుబడి వచ్చిందని వ్యవసాయాధికారులు తెలిపారు. కార్యక్రమంలో ఆత్మ బీటీఎం బాబూరావు, ఏఈవో జగ్గ అప్పారావు, ఏపీఎస్ఎఫ్ స్టాఫ్ రామకృష్ణ పాల్గొన్నారు.



పంట కోత ప్రయోగం నిర్వహిస్తున్న దృశ్యం



అరుణాచలేశ్వరునికి విశిష్ట పూజలు

ప్రత్తిపాడు, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రాచపల్లిలో అపీత కుంచాబ సమేత అరుణాచలేశ్వరునికి సోమవారం పంచామృత అభిషేకాలు, పూజలు చేసి విశేష అలంకరణ జరిపారు. రాచపల్లి, ఒమ్మంగి, ప్రత్తిపాడు, ధర్మవరం గ్రామాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చి స్వామిని దర్శించుకున్నారు.

అదృశ్యమైన బాలిక తల్లిదండ్రులకు అప్పగింత

కిర్లంపూడి, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): కిర్లంపూడికి చెందిన 15 సంవత్సరాల బాలిక సోమవారం ఉదయం నుంచి కనిపించకపోవడంతో తల్లిదండ్రులు పది గంటలకు కిర్లంపూడి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. దీనిపై కేసు నమోదు చేసిన పోలీసులు వెంటనే దర్యాప్తు చేపట్టారు. ఆరు గంటల్లోగా బాలికను వెతికి వారికి తల్లిదండ్రులకు అప్పగించారని జగ్గంపేట సీఐ వైఆర్కే శ్రీనివాస్ తెలిపారు. పోలీసులకు తల్లిదండ్రులు కృతజ్ఞతలు తెలిపారు.

జగనన్న కాలనీవాసుల ఆందోళన

ఏలేశ్వరం, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): 'గత ప్రభుత్వంలో చాలీచాలని స్థలాలు ఇచ్చి ఇళ్లు నిర్మించుకోవాలని స్థానిక నాయకులు చెప్పారు. దీంతో అప్పులు చేసి ఇళ్లు నిర్మించుకున్నాం. కానీ నేటికీ కాలనీలో రోడ్లు, డ్రైన్లతో పాటు పలు సమస్యలతో సతమతమవుతున్నాం... అయినా అధికారులు పట్టించుకోవట్లేదు' అంటూ జగనన్న కాలనీ మహిళలు సోమవారం నగర పంచాయతీ కార్యాలయం వద్ద ఆందోళనకు దిగారు. ఇచ్చిన సెంటు స్థలంలో కొందరు రెండు అంతస్తుల భవనం నిర్మించుకుంటే అనుమతి ఎవరిచ్చారంటూ అధికారులు నోటీసులు ఇస్తున్నారని గగ్గోలు పెట్టారు. అధికారులు స్పందించి తమకు సదుపాయాలు కల్పించాలని కమిషనర్ సత్యనారాయణకి వినతిపత్రం అందజేశారు.



నగర పంచాయతీ కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న మహిళలు

ప్రమాదాల నివారణకు చర్యలు

జగ్గంపేట, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): పెద్దాపురం సర్కిల్ పరిధిలో జాతీయ రహదారిపై ప్రమాదాల నివారణకు సోమవారం సాయంత్రం సీఐ శ్రీనివాస్ ఆధ్వర్యంలో హైవే అథారిటీ అధికారులు, పోలీస్ సిబ్బంది చర్యలు చేపట్టారు. పెద్దాపురం డీఎస్పీ శ్రీహరిరాజు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. జేవీఆర్ జంక్షన్ వద్ద జాతీయ రహదారిపై విశాఖపట్నం నుంచి రాజమహేంద్రవరం, రాజమహేంద్రవరం నుంచి విశాఖపట్నం వైపుగా వాహనాలతో పాటు, జేవీ ఆర్ జంక్షన్ రోడ్డు దాటే వాహనాల వేగం నియంత్రించేందుకు రేడియం స్టిక్కర్లతో కూడిన పెద్ద టైర్లను, జిగ్‌జాగ్, రెడ్ ఫ్లాగ్‌లను రోడ్డుకు ఇరువైపులా ఏర్పాటు చేశారు. రామవరం జాతీయ రహదారిని ఆనుకుని మల్లిపాక వెళ్లే అండర్ పాస్ వంతెన కింద మార్గాన్ని శ్రీహరిరాజు పరిశీలించారు.

వంద రోజుల ప్రణాళికను

పకడ్బందీగా అమలు చేయాలి

రౌతులపూడి, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): పదో తరగతి విద్యార్థులకు వంద రోజుల ప్రణాళికను పకడ్బందీగా అమలు చేయాలని ఉపాధ్యాయులకు డీఈవో పి.రమేష్ సూచించారు. సోమవారం ఆయన ఎస్.అగ్రహారం, బలరామపురం, రౌతులపూడి జిల్లా పరిషత్ పాఠశాలలను సందర్శించారు. విద్యార్థుల సామర్థ్యాన్ని పరీక్షించారు. మూడు నుంచి పదో తరగతి వరకు విద్యార్థుల విద్యా ప్రమాణాలు మెరుగుపర్చడానికి సూచనలు చేశారు. ప్రతి విద్యార్థికీ అపార్ నెంబరు జనరేట్ అయ్యేలా చర్యలు తీసుకోవాలని కోరారు.



కేక్ కట్ చేస్తున్న కాంగ్రెస్ నేత శ్రీను

సోనియాగాంధీ జన్మదిన వేడుకలు

ప్రత్తిపాడు, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): సోనియాగాంధీ జన్మదినం సందర్భంగా కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో పీసీసీ సభ్యుడు ధర్నాలకోట శ్రీను కేక్ కట్ చేసి కార్యకర్తలకు పంచారు. జిల్లా కాంగ్రెస్ కమిటీ ఉపాధ్యక్షుడు కొప్పన కోటేశ్వరరావు, ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు మొయ్యేటి సూర్యప్రకాష్, కార్యకర్తలు కందిమళ్ళ శామ్యూల్, కార్యకర్తలుపాల్గొన్నారు.

డ్రంకెన్ డ్రైవ్‌లో

14 మందికి జరిమానా, జైలు శిక్ష

ప్రత్తిపాడు, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): ప్రత్తిపాడు సర్కిల్‌లోని ప్రత్తిపాడు, ఏలేశ్వరం, పోలీస్ స్టేషన్ల పరిధిలో డ్రంకెన్ డ్రైవ్ కేసులో 14 మందికి జైలు శిక్ష, జరిమానా విధిస్తూ జడ్జి కాటం భాను సోమవారం తీర్పు చెప్పారని సీఐ సూర్య అప్పారావు తెలిపారు. 12 మందికి రూ.10వేలు వంతున జరిమానా, ఇద్దరికి ఏడు రోజులు జైలు శిక్ష విధించారు.

కదలక... మెదలక

రెండ్రోజులుగా మలుపులో నిలిచిన లారీ

ఎటపాక, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): విజయవాడ-జగదల్‌పూర్ జాతీయ రహదారిపై చోడవరం-వెంకటరెడ్డిపేట మధ్యలో మలుపు వద్ద రహదారిపై లోడ్ లారీ నిలిచిపోయింది. ఛత్తీస్‌గఢ్‌కు చెందిన లారీ రెండు రోజుల క్రితం నెల్లిపాక నుంచి భద్రాచలం వైపు జామాయిల్ కర్రల లోడుతో వెళ్తున్న లారీ బాడీ విరిగిపోయింది. డ్రైవర్ దానిని అక్కడే నిలిపి సపోర్టుగా జామాయిల్ కర్రలు ఉంచాడు. జాతీయ రహదారి కావడంతో భారీ వాహనాల రాకపోకలు నిత్యం అధికంగా సాగుతాయి. రోడ్డు మలుపులో నిలిచిపోవడంతో ప్రమాదాలకు ఆస్కారం వుంది. అధికారులు స్పందించి లారీని అక్కడి నుంచి తీయించాలని వాహనచోదకులు కోరుతున్నారు.



నేడు పోలవరం నిర్వాసితుల సదస్సు

ఎటపాక, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): ఏలూరు జిల్లా వేలేరుపాడులో మంగళవారం జరిగే పోలవరం నిర్వాసితుల సదస్సును జయప్రదం చేయాలని సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి కందుకూరి స్వర్ణ కోరారు. ఇంతవరకు పరిహారం చెల్లించని భూములకు ఎకరాకు రూ.20 లక్షలు ఇవ్వాలని, అల్లూరి జిల్లాలోని గిరిజనులు, గిరిజనేతరులకు గోకవరం పరసర ప్రాంతాల్లో పునరావాసం కల్పించాలన్నారు. మండలాన్ని యూనిట్‌గా తీసుకుని భూసేకరణ చేసి ఆర్‌అండ్‌ఆర్ ప్యాకేజీ పరిహారం చెల్లించాలన్నారు. అర్హతలున్న వారిని నిర్వాసితుల జాబితాలో చేర్చాలన్నారు. పరిహారమిచ్చే నాటికి 18ఏళ్లు నిండిన ప్రతి ఒక్కరికీ ఆర్‌అండ్‌ఆర్ ప్యాకేజీ పరిహారం చెల్లించాలన్నారు.

'టూరిస్టు ప్రాంతాలుగా గుర్తించాలి'

వై.రామవరం, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): మండలంలోని యార్లగడ్డ మీదుగా ఉన్న అటవీ ప్రాంతంలో ప్రకృతి సిద్ధమైన గురమంద విశ్వనాథస్వామి ఆలయం, శేషరాయి జలపాతం విహార యాత్రలకు అనువుగా ఉన్నాయి. కార్తీకమాసం, వేసవి కాలంలో ఎంతో మంది టూరిస్టులు వస్తున్నందున ఈ ప్రాంతాలను పర్యాటకంగా అభివృద్ధి చేసేందుకు అధికారులు చర్యలు తీసుకోవాలని గురమంద ఆలయ కమిటీ కన్వీనర్ పల్లాల వెంకటరమణారెడ్డి కోరారు. రహదారులు, ఇతర సౌకర్యాల కల్పనకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పర్యాటక నిధులు కేటాయించాలని కోరారు. గిరిజన సంఘం నాయకులు పల్లాల రవిరెడ్డి, ఎం.రామకృష్ణారెడ్డి, ఎం.సురేష్‌రెడ్డి, పి.కృష్ణారెడ్డి పాల్గొన్నారు.